సముద్రపు దొంగల ముఠా

కె. వి. రమణ

మధ్యధరా సముద్ర జలాలను రెండుగా చీలుస్తూ భారంగా ముందుకు సాగుతోంది 'సాగరకన్య' నౌక. నౌకలో ఇంజిన్, జనరేటర్లు చెవులు హోరెత్తే ధ్వనితో నిర్విరామంగా పని చేస్తున్నాయి.

నౌక గమనాన్ని, వాతావరణ పరిస్థితిని ఒకమారు చూసుకొని తృప్తిగా తలపంకించాడు కెప్టెన్ రాజు. విశ్రాంతికోసం తన గది చేరాడు రాజు. సగం చదివి విడిచిన ఇంగ్లీషు నవలను తిరిగి చేతబట్టి సోఫాలో చతికిలబడ్డాడు.

కెప్టెన రాజు వయసు ముప్పైఆయిదేళ్ళు. అంత చిన్న వయసులో నిండా పదేళ్ళు సర్వీసు పూర్తికాకమునుపే నౌకలో అత్యున్నత స్థానమయిన కెప్టెన్ పదవి చేపట్టాడు రాజు. అరుదయిన ఈ విషయాన్ని కేవలం తన శక్తి సామర్థ్యాల మూలంగానే సాధించగలిగాడతను.

దీక్షగా నవలలో మునిగిపోయాడు రాజు. కథ రస

త తరంగా సాగుతోంది. ఇంతలో "బజ్ ....జ్ ...." మంటూ గోడవచేసింది ఫోను. నవల ప్రక్కన పెట్టి ఫోనెత్తాడు రాజు. ఎటువంటి పరిస్థితిలోనూ విసుగూ, కోపం దరిచేరని వ్యక్తి రాజు. నిజానికి అతని విజయ రహస్యం కూడా అదే అంటారు అతణ్ణి తెలిసిన వ్యక్తులు.

రిసీవర్ చెవికానించి "హలో!" అన్నాడు రాజు.

"సర్! హెడ్‌క్వార్టర్స్ నుండి అర్జంట్ మెసేజ్. మీరు రావాలి" ఆదుర్దాగా పలికాడు చీఫ్ ఆఫీసర్ బల్వంత్ రాయ్.

"వస్తున్నాను!" ఫోన్ పెట్టి క్షణాలమీద వీల్ హౌస్‌లో వాలాడు రాజు.

హెడ్‌క్వార్టర్స్‌నుండి ఆ మెసేజిని స్వయంగా విన్నాడు రాజు. రాజుతోబాటు బల్వంత్, మరో ఇద్దరాఫీసర్ల ముఖాలు గంభీరమయ్యాయి ఆ వార్త విన్న వెంటనే.

"ప్రస్తుతం 'సాగరకన్య' ప్రయాణం చేస్తున్న సముద్ర ప్రాంతం ఇక కొద్ది గంటల వ్యవధిలో భయంకరమయిన తుఫాను తాకిడికి గురికానున్నది" ఇదీ ఆ వార్త సారాంశం.

ఈ విషయం క్షణాలమీద సిబ్బంది అందరికీ తెలియజేయబడింది. అందరూ లైఫ్ జాకెట్లు ధరించారు. సాగర జలాలు నౌకలో ప్రవేశించకుండా అన్ని ప్రవేశ ద్వారాలూ మూసివేయబడ్డాయి. కిటికీల అద్దాలు బిగించబడ్డాయి. ఇవన్నీ నౌకలో ఒక నీటిచుక్కను సయితం పోనివ్వని విధంగా రూపొందించబడతాయి.

నౌక సిబ్బంది నిమిషాలు లెక్కపెడుతున్నారు. ఎవరూ పెదవి విప్పి మాటాడడం లేదు.

వాతావరణం క్రమేపీ మార్పు చెందసాగింది. ఆకాశం కారుమబ్బులు కమ్మింది. చిన్నగా ప్రారంభమయిన గాలీ-వానా కొద్ది సేపటికే వుధృతరూపాన్ని దాల్చింది. హోరుమనే శబ్దంతో వీస్తున్న గాలి బ్రహ్మాండమయిన ఆ నౌక గమనాన్ని క్షణానికొక దిశకు మారుస్తోంది. సముద్ర కెరటాలు ఒకదాని కొకటి పోటీపడుతూ 'సాగరకన్య' డెక్ మీద వీరవిహారం చేస్తున్నాయి.

సాగరకన్య పడుతూ లేస్తూ రెక్కలు తెగినపక్షిలా కొట్టుమిట్టాడుతోంది. ప్రకృతి బీభత్సానికి ఆ దృశ్యం పరాకాష్ట. ఇంతలో సముద్రంలో సుమారు రెండు తాడి చెట్ల ఎత్తున ఓ బ్రహ్మాండమయిన పోటుకెరటం సాగర కన్యకు ఓ ప్రక్కగా వచ్చి పైన పడింది.

అంతే! నౌక మొత్తం ఒకేసారి నీటిలోకి నొక్కి వేయబడింది.

2

కెప్టెన్ రాజా నీటిలో తేలేందుకు శక్తికొద్దీ ఈదుతున్నాడు. "కెప్టన్ సాబ్" వినపడిందో గొంతు దూరం నుండి అస్పష్టంగా. అటు తిరిగాడు రాజా.

పెద్ద కర్రదుంగను పట్టి వేలాడుతూ కనిపించారు బల్వంతిరాయ్. ప్రకాష్‌లు. వారిద్దరూ ఆ దుంగను రాజా దిక్కుగా తోసుకు వచ్చేందుకు శక్తికొద్దీ ప్రయత్నిస్తున్నా గాలీ కెరటాలు వారి ఉద్దేశానికి అడ్డు కట్ట వేస్తున్నాయి.

రాజా శక్తిని కూడగట్టుకొని అటు ఈదాడు. ఎట్టకేలకు దుంగను చేరుకోగలిగాడు. అదృష్టం ఆ రూపంలో వచ్చి వుండకపోతే రాజా పని ఇక అంతటితో సరి.

ఆ ముగ్గురూ కలిసి రవి, సునీల్ అనే మరో ఇద్దర్ని

కాపాడగలిగారు. మిగిలినవారు యేమయ్యారో, ఎటు కొట్టుకుపోయారో తెలియదు. ఐదుగురూ దుంగను అలా అంటిపెట్టుకొని గాలివాటున పోతున్నారు.

దారీ తెన్నూ లేని అనంత సాగరజలాలు! ఆకలిదప్పులు! ఆశనిరాశలు! ఎన్ని రాత్రులు ఎన్ని పగళ్ళు! లెక్క పెట్టే ఓపిక లేనే లేదు. అవసరం అంతకన్నా లేదు. ఎటు చూసినా నీరు....నీరు....నీరు. అందుకే కళ్ళే తెరవడం మానుకున్నారందరూ.

ఒక రాత్రి వేళ! సమయం వారిలో ఎవరికీ తెలియదు. దుంగను అంటి జీవచ్ఛవంలా వేలాడుతున్న ఒకరి కాళ్ళకు గట్టిగా తగిలిందేదో. త్రుళ్ళిపడుతూ తడిమిచూశాడు కాలివేళ్ళతో ఇసుక నేల! నమ్మకం చాలక కాలితో తన్నాడు గట్టిగా. వుక్కిరిబిక్కిరవుతూ చుట్టూ చూశాడు. చెట్టుచేమలతో నిండిన ప్రకృతి. ఎత్తయిన కొండలు ఆ చీకటిలో లీలగా కనపడుతున్నాయి.

మొత్తంమీద తామేదో తీరాన్ని చేరుకున్నారు. లేని ఓపిక తెచ్చుకుంటూ ఆనందంతో అరచాడు గట్టిగా. మిగిలిన నలుగురూ వులిక్కిపడుతూ కళ్ళు తెరచారు.

“మనం తీరం చేరాం....తీరం చేరాం...అవిగో కొండలు. నేనిప్పుడు నేలమీద నిలబడి వున్నాను....హాహా హా....హాహాహా” దుంగను వదిలి గంతులు వేస్తున్నాడు బల్వంత్

బల్వంత్ మాటలు నమ్మలేనట్టు చుట్టూ చూశారంతా. నిజమే!

చెట్లు గాలికి వూగిసలాడుతూ వారికి స్వాగతం చెబుతున్నాయి. అవేవో పక్షులు కర్ణకఠోరంగా అరుస్తున్నాయి. అయినా ఆ స్వరాలు వారికి ఆ క్షణంలో

యెంతో విన సొంపుగా వున్నాయి. చీకటినిండి భయాన్ని రేకెత్తించే ఆ ప్రకృతి నయనానందకరంగా వుంది.

నీరసాన్ని ప్రక్కనబెట్టి వురుకులు పరుగులమీద తీరాన్ని చేరారంతా. గట్టిగా అరుస్తూ చిన్న పిల్లల్లా కేరింతలాడుతూ ఒకరినొకరు కౌగలించుకున్నారు. అయితే ఆనందపు సమయాన్ని అంతకుమించి ఎక్కువసేపు అనుభవించే అవకాశం వారికి లేకపోయింది.

కారణం! విపరీతమయిన చలి! శరీరాన్ని కోసుకు పోతున్నట్టు వీస్తున్న చలిగాలుల ధాటికి అప్పటికే నీటిలో బాగా నాని ఒరుసుకుపోయిన వారి శరీరాలు ఏమాత్రం తట్టుకోలేక పోతున్నాయి. వృత్తిరీత్యా వారందరూ నౌకలలో తిరుగుతూ ఎన్నో చలిప్రదేశాలను చూసివున్నారు. కానీ యింతటి దారుణమయిన చలి గాలుల్ని వారెన్నడూ చూడనేలేదు. ఇంతా చేసి మనుషుల్ని తృణాలమీద గడ్డకట్టేటున్న మైనస్ డిగ్రీల టెంపరేచర్‌లో వున్న ఆ ప్రదేశంలో యెక్కడా ఒక మంచుగడ్డ సయితం లేకపోవడం విచిత్రం.

చలిబాధనుండి తమను కాపాడుకునేందుకు అప్పటి కప్పుడు వారికో ప్రావరం అవసరమయింది. లేకుంటే గంటల్లో అందరి చావూ ఖాయం. ఒక వంక చలిలో గజగజలాడుతూనే తీర ప్రాంతంలోవున్న పర్వత సానువులను వారు గాలించారు.

ప్రకాష్ "అల్లదిగో అటు చూడండి, అక్కడేదో గుహలా వుంది" అనగానే అంతా అటు పరుగుతీశారు.

అదృష్టవశాత్తూ అనేక చిన్న గుహ! అందరు లోనికి ప్రవేశించారు. అయినా చలిగాలులు గుహలోకీ వీస్తున్నాయి. చెప్పాలంటే ఆ గుహ సయితం ఓ ఏ. సి.

రూమ్‌ని మించి వుంది.

"బల్వంత్ ముందా గుహ ద్వారాన్ని మూయాలి మనం. లేకుంటే ఈ చలి మన ప్రాణాల్ని తోడేస్తుంది" అన్నాడు రాజు. అదీ నిజమే! అప్పటికే వారి శరీరాలు వంకరులు పోతున్నట్టున్నాయి.

గుహ ముఖద్వారం అంత పెద్దదేం కాదు. అందరూ కలసి తలో రాయి పెద్ద పెద్దవి తెచ్చి గుహ ద్వారానికి అడ్డంగా గోడలా పేర్చేశారు. ఇప్పుడు గుహలోకి దూసుకువచ్చే చలిగాలులు బాగా తగ్గిపోయాయి.

తలో మూలకుపోయి కాళ్ళూ చేతులూ ముడుచుకు కూర్చున్నారు. గుహ అప్పటికే బాగా చల్లనయి వున్న కారణంగా వారికి ఇంకా చలిబాధ తీరలేదు. రాజు లేచి గుహంతా కలయతిరిగాడు. గాలివాటున లోపలికి కొట్టుకువచ్చిన ఎండుటాకులు కాళ్ళకు ఒత్తుగా తగులుతున్నాయి.

రాజు ఓపిగ్గా వాటిని ఏరి ఒకచోట పోసాడు. పెద్ద కుప్ప తయారయింది. రెండు రాళ్ళు గట్టివి ఏరి తెచ్చి కొద్దిపాటి ఆకులమీద ఆ రాళ్ళను రాపాడించి మంట సృష్టించాడు. అందరూ మంట చుట్టూ చేరారు. కొద్ది కొద్దిగా ఆకుల్ని మంటలో వేస్తూ చలికాగారంతా. కొద్ది సేపట్లో గుహకూడా బాగా వెచ్చనయింది. చలిబాధ తీరింది.

ఆ వెంటనే నేనున్నానంది ఆకలిబాధ. అయినా తిరిగి గుహ బయటికి వెళ్లాలంటే వీలుపడేదేం కాదు. ఆ వెచ్చదనమే అప్పటికి తమ పెన్నిధిగా తృప్తిపడుతూ కడుపుల్లో కాళ్ళుపెట్టుకు నిద్రపోయారంతా.

3

తెల్లవారింది. అంత చలీమంత్రం వేసినట్టు మాయమయింది. గుహాద్వారానికి అడ్డం పెట్టిన రాళ్ళను తొలగిస్తూ బయటపడ్డారంతా. తిండి తిని ఎన్నిరోజులయిందో కడుపులో మంటలు రేగుతున్నాయి.

ఆహారాన్ని వెతుకుతూ బయల్దేరారు. చూడగా అదో విచిత్ర ద్వీపంలా వుంది. కంటపడే వృక్షజాతులన్నీ ఇంచుమించు వాళ్ళకు తెలిసినవే. కాని వాటిలో కొన్ని ప్రత్యేకతలున్నాయి. ఆకులు బాగా తక్కువగా వుండి చెట్లన్నీ దాదాపు మోడుల్లా వున్నాయి. పక్షులూ అంతే! పావురాలు సయితం కర్ణకఠోరంగా భయంకరంగా అరుస్తున్నాయి. కింద నడుస్తున్న రాజు బృందాన్ని తీక్షణంగా నిర్లక్ష్యంగా చూస్తున్నాయి.

"శ్రీవెన్ సాబ్! చూశారా వాటిని. ఇక్కడ పరిస్థితి నాకేం అర్థం కావడంలేదు" అన్నాడు బల్వంత్.

నవ్వాడు రాజు. "కొత్తవాళ్ళంగదా యెవరికయినా తెలికే మరి" అన్నాడు.

"ఇంతకూ ఈ దీవి యే ప్రాంతానికి చెందినదో మీరేమయినా చెప్పగలరా?" అడిగాడు బల్వంత్.

పెదవి విరిచాడు రాజు. "నా వుద్దేశ్యం ఇది ఇంతవరకూ వెలుగులోకి రాని ప్రాంతం. చూడగా మనుషులెవరూ వుండే అవకాశం లేదనిపిస్తోంది" అన్నాడు.

నడుస్తున్నవాడల్లా చటుక్కున ఆగి మాట్లాడవద్దన్నట్టు సైగ చేశాడు రాజు. అందరూ ఎక్కడివారక్కడే నిలబడిపోయారు. నల్లని కుందేళ్ళు రెండు కాస్తంత దూరంలో పొదల చేరువన నిద్రపోతూ కనిపించాయి. రూపంలో తప్ప మామూలు కుందేళ్ళకూ వీటికీ పరిమా

ణంలో పోలికే లేదు. ఒక్కొక్కటీ యెంతలేదన్నా ఇరవై కేజీల బరువుంటుంది.

బల్వంత్ "మై గాడ్! ఎంత పెద్దదో" అన్నాడు ఆశ్చర్యంగా గొణుగుతూ.

రాజు సైగచేయగా బల్వంత్ ప్రకాష్‌లు ఒక దిక్కు రవి సునీల్ మరో దిక్కు వెళ్ళారు. రాజు ఒక్కడే ముందుకు కదిలాడు నెమ్మదిగా. ఆ రెండు జట్లూ పొదల వెనకనుండి కమ్ముకు వస్తున్నారు. ఉండేళ్ళు ఎటు పరుగెత్తినా వారికి చిక్కక తప్పదు.

బల్వంత్ జట్టు ఓ అడుగు ముందు చేరిందక్కడికి. వారిద్దరూ ఉండేళ్ళను తామే పట్టాలన్న ఉత్సాహంతో ఒకేసారి వాటిమీద పడ్డారు. నిద్రలో వున్న ఉండేళ్ళు చటుక్కున్న కళ్ళు తెరచి మెరపుతీగల్లా ప్రక్కకు గెంతాయి. బల్వంత్, ప్రకాష్‌లు నేలమీద బోర్లా పడ్డారు.

ఇక ఆ క్షణంలో ఉండేళ్ళు తమ బారినుండి తప్పించుకు పోయినట్టేనని భావించారంతా. కానీ ఉండేళ్ళు పారి పోలేదు సరికదా వారంతా నిశ్చేష్టులయ్యేట్టు గుర్రు పెడుతూ వారిమీద తిరగబడ్డాయి. అప్పటికే నేలమీద బోర్లా మోచేయి మడుకులూ కొట్టుకుపోయిన బల్వంత్ ప్రకాష్‌లమీద పడ్డాయవి.

అందిన చోటల్లా వారిద్దరినీ గోళ్ళతో రక్కుతూ పండ్లతో కండలు చీల్చివేసే ప్రయత్నం చేస్తున్నాయి. బల్వంత్ ప్రకాష్‌లు ఊహించని రీతిలో ఉండేళ్ళు తమ మీదకు దాడి జరపడంతో పరిస్థితిని తట్టుకోలేకపోతున్నారు.

అప్పటికి ఆశ్చర్యంనుండి తేరుకున్న మిగిలిన ముగ్గురూ

వెనకనుండి కుందేళ్ళమీద పడ్డారు. అయినా బెదరలేదవి. అందరికీ సమాధానం చెబుతూ పొట్టేళ్లలా కలయతిరుగుతున్నాయి కుందేళ్ళు. రాజుకి వాటిని ఒకేసారి నరికి పారేయాలన్నంత కోపం వచ్చింది. అప్పుడే జ్ఞాపకం వచ్చిందతనికి తన జేబులో అహార్నిశలూ వుండే ఫోల్డింగ్ నైఫ్.

క్షణమయినా ఆలస్యం చేయక చాకుతీసి కుందేళ్ళను దొరికినచోటల్లా పొడిచేశాడు రాజు. కుందేళ్ళు రెండూ నిర్జీవంగా నేలమీద పడిపోయాయి.

బల్వంత్ ఒంటికి అంటిన దుమ్ము దులుపుకుంటూ "థాంక్స్ కేప్టన్ సాబ్! మీ దగ్గర ఆ చాకు వుండడం నిజంగా మన అదృష్టమే. లేకుంటే ఈ పాడు మృగాలు మనలో కొందర్ని పీక్కుతి నేవి" అన్నాడు.

"అది సరే! ఇంతకూ ఇదేం వింత. కుందేళ్ళకు ఇంత సాహస మేమిటి?" ఆశ్చర్యంగా అన్నాడు ప్రకాష్.

చాకుకు అంటిన రక్తాన్ని చెట్ల ఆకులకు తుడుస్తూ "బహుశా అది ఈ దీవి మహాత్యం కావచ్చు" అన్నాడు రాజు.

అప్పటికప్పుడు నిప్పు తయారుచేసి కుందేళ్ళను కాల్చి తిన్నారు. అందరూ కడుపునిండా తినగా ఇంకా మిగిలి పోయింది మాంసం. "దెబ్బలుతింటే ఏం కుందేళ్ళు మాంసం అద్భుతం" అన్నాడు బల్వంత్ దేక్కుపోయిన ముడుకులు తడుముకుంటూ.

ఆకలి బాధ తీరింది. కానీ అంతలోనే మరో బాధ వచ్చి పడింది. సూర్యుడు పైకి వస్తున్నకొద్దీ వాతావరణం క్రమేపీ వేడెక్కుతూ గాడ్పులు ప్రారంభమయ్యాయి.

మిట్టమధ్యాహ్నమయ్యేసరికి వాతావరణం దారుణంగా

మారిపోయింది. చెట్ల నీడలో వున్నా ప్రయోజనం లేక పోతోంది. వేడిగాలులు శరీరాన్ని వుడికిస్తున్నాయి.

రాజా బృందం పూరకే పిచ్చికుక్కల్లా తిరుగుతున్నా రక్కడికక్కడే. చెప్పాలంటే రాత్రి చలిబాధను మించిపోయిందీ బాధ. ఆ వేడికి తగట్టు శరీరం యే మాత్రం చెమటపోసినా కొంత ఉపశమనం కలిగేది. కానీ అదేం విచిత్రమో అంత వేడిలోనూ చెమటపట్టలే దెవరికీ.

వారందరి బాధా ఒక ఎత్తూ! బల్వంత్ రాయ్ బాధ మరింత హెచ్చు. అతడిది ఎనభై అయిదు కేజీల భారీ విగ్రహం మరి. అపసోపాలు పడుతూ "ప్రపంచంలో కెల్లా అధిక ఉష్ణోగ్రతను కలిగిన సహారాలోని అజీజీయా ఈ లెక్కన చల్లని ప్రదేశం" అన్నాడాయన. ఆ రోజంతా గడిపి సాయంత్రాన్ని చూసేసరికి వారికి తాతలు దిగివచ్చారు.

సాయంత్రం కావస్తుదంటే చలిభూతం నేనున్నా నంటూ అప్పుడే వార్తలు పంపుతోంది. చిన్నగా ప్రారంభమయ్యాయి చలిగాలులు. అందుకు వారంతా ముందుగానే సిద్ధపడుతూ ఓ గుహను వెదకి క్రాకంపా చేరవేసారందులో. చీకటి పడుతుండగా చలిగాలులు వుధృతమయ్యాయి. గుహలో నెగడు ప్రారంభమయ్యింది.

మంటలో ఒక్కొక్క కర్ర వేస్తూ "ఈ వాతావరణంలో మనం ఇలా ఎన్నాళ్లో బ్రతకలేమిక్కడ. ఇది మరీ మారుమూల దీవి కాబట్టి మనకు బయటనుండి సహాయం వచ్చే మాటకూడా కల్లగా తోస్తోంది నాకు. అందుకని మనం ఇక్కడే ఏదోలా కాలం వెళ్ళబుచ్చే కన్నా దీవి లోపలికి వెళ్ళడం మంచిదని నా ఉద్దేశం.

లోపల ఈ వాతావరణమయినా మారొచ్చు. మన అదృష్టం బాగుండి మరొకచేదన్నా జరగవచ్చు" అన్నాడు రాజు అందరివంకా చూస్తూ మీరేమంటారన్నట్టు.

బల్వంత్ రాయ్ తల ఊపుతూ "నా మనసులో మాట కూడా అదే కేప్టెన్ సాబ్" అన్నాడు మిగిలిన ముగ్గురూ అంగీకారంగా తలవూపారు.

రాజు "మంచిది. మనమంతా ఒకే అభిప్రాయాన్ని కలిగివుండడం సంతోషం. అయితే ఇక్కడ మనం గమనించవలసిన విషయం ఒకటుంది. వుదయం కండేళ్ళ పరిస్థితిని చూసి ఈ దీవిలో మిగతా జంతువుల సాహసాన్ని మనం అంచనా వేసుకోవచ్చు. అందుకు కారణం ఇక్కడి అసాధారణ వాతావరణమేనని నా ఉద్దేశం. దారుణమయిన ఇక్కడి పరిస్థితులకు అనుకూలంగా మనమూ మారాలి. తప్పదు. ఎటువంటి కష్టాన్నయినా అందరం కలిసే ఎదుర్కోవాలి. చావో బ్రతుకో అందరం ఉమ్మడిగానే స్వీకరిద్దాం" అన్నాడు.

అందరూ రాజు మాటలకు అంగీకారం తెలుపుతూ చేతులెత్తారు. "కేప్టెన్ సాబ్! మేమంతా మీమాటను అనుసరిస్తాం. మృత్యువు తప్ప మనల్ని వేరుచేసేది ఏదీ లేదు" అన్నారంతా.

"మంచిది. మనం తిరిగి మన దేశంలో అడుగుపెడతామన్నది నా దృఢ విశ్వాసం. అయితే ఒకమాట. ఇక మీదట మనలో భేదాలు హెచ్చుతగ్గులు వుండకూడదు. కాబట్టి మీరంతా నన్ను మీలో ఒకడిగానే భావించి రాజు అని పిలవండి. సాబ్ గీబ్ వద్దు" అన్నాడు రాజు నవ్వుతూ.

బల్వంత్ రాయ్ హుషారుగా "అచ్ఛా సాబ్!" అంటూ వెంటనే హారపాటు గ్రహించి నాలుక కరచు కున్నాడు. రాజుతో సహా అందరూ నవ్వేశారు పెద్దగా.

4

రాత్రి గడచి కొద్దిగా వెలుతురు వస్తుండగానే గుహ వదలి పెట్టారంతా.

అప్పటికి చలి కొంచెం ఎక్కువగానే వుంది. ఎండ ఎక్కువ కాకముందే సాధ్యమయినంత దూరం వెళ్ళా లన్నది వారి ఉద్దేశం. రాజు ఓ మూడు బలమయిన చెట్టుకొమ్మల్ని విరిచి వాటి ఒక కొనను తనవద్దనున్న చాకుతో సూదిగా చెక్కాడు. వాటిని తలా ఒకటి పట్టుకున్నారు ఆయుధాలుగా.

దారిలో లేళ్ళూ దుప్పులూ అటూ యిటూ తిరుగుతూ కనిపిస్తున్నాయి. ఒక్కొక్కటి మన ప్రాంతంలో వుండే దున్నల్లా బలిసి వున్నాయి. తలఎత్తి చెవులు రిక్కిస్తూ తమ మధ్యకొచ్చిన ఈ వింత ప్రాణుల్ని ఆశ్చర్యంగా చూస్తున్నాయవి. అంతే తప్ప బెదిరి పారి పోలేదవి. ఒకచోట వారే దారికడ్డంగా వున్న అటు వంటి జంతువుల్ని తప్పుకు పోతున్నారు. వాటిని అలా చూస్తుంటే కడుపులో కదులాడే ఆకలి గుర్తొచ్చి బాధగా వుంది వారికి. కానీ రాజు ముందే చెప్పాడు వారికి.

"మరీ తప్పనిసరి పరిస్థితుల్లో తప్ప ఏ జంతువు జోలికీ పోవద్దు మనం. అలాగని మనం ప్రతిదానికీ భయపడు తున్నామని మీరు చిన్నబోనవసరంలేదు. ప్రస్తుతం మనలో ఎవరూ గాయపడే పరిస్థితిని కోరి తెచ్చుకోకూడదు. అదే జరిగినవాడు మిగిలిన వాళ్ళకు ఇబ్బందేగాక తొంద

రగా కోలుకునే పరిస్థితికూడా లేదు" అన్నాడు.

సాధ్యమయినంతవరకూ తిండికోసం పళ్లూ కాయలు దుంపలమీదే ఆధారపడే ప్రదేశంలో దారిలో ఎదురయే అటువంటి వాటిని పోగుజేస్తూ ముందుకు సాగుతున్నారు వారు.

సూర్యుడు క్రమేపీ పైకెక్కుతూ వుండగా గాలి వెచ్చదనాన్ని పుంజుకోసాగింది. దారిలో చెట్లు సమృద్ధిగా వున్నచోట ఆగిపోతూ "ఇప్పటికి ఇక్కడే ఆగిపోవడం మేలు" అన్నాడు రాజా.

అంతా చెట్లనీడలో విశ్రమించి దారిలో సంపాయించిన పళ్ళూ కాయలూ పంచుకుతిన్నారు. ఇంచుమించు మూడు గంటలు గడిచేవరకూ వేడిమిలో నరకయాతనపడ్డారు. తర్వాత వేడిగాలులు తగ్గుముఖం పడుతుండగా ప్రయాణం కొనసాగింది.

ఓ అరగంట నడిచారలా. ఇంతలో గజిబిజిగా కొన్ని విచిత్ర స్వరాలు వినపడ్డాయి వారికి. చెవులు రిక్కించారంతా. వెనక్కి తిరిగి చూశారు. వారు నడిచి వచ్చిన దారిలో ధూళి రేగుతూ తమ దిక్కుగా కదలివస్తోంది.

"ఏమిటది?" అడిగాడు బల్వంత్ ఆందోళనగా.

అతడి మాటలు పూర్తికాకమునుపే ఆ స్వరాలు స్పష్టంగా వినపడ్డాయి.

రాజా పెద్దగా "పరుగెత్తండి. క్విక్. అవి తోడేళ్ళు" అని అరిచాడు. అసరికి తోడేళ్ళ మంద స్పష్టంగా కనిపించింది వారికి. తోడేళ్ళు వాయువేగంతో వస్తున్నాయి. వాటికి మనుషులగాలి సోకినట్టుంది. వేగాన్ని పెంచాయి.

ప్రాణాలు అరచేతుల్లో వుంచుకొని పరుగుతీస్తున్నారంతా. కనుచూపుమేరలో చెట్లేవీ లేవు. అంతా రాళ్ళూ

రప్పలతో నిండిన మిట్టప్రాంతమది. తోడేళ్ళు ఇంచుమించు దగ్గరకొచ్చేసాయి. వాటితో సమానంగా పరుగెత్తగల శక్తి మనుషుల కెక్కడిది? అలాగే లెక్కకు మించి వున్న ఆ మందను యెదిరించే అవకాశమూ లేదు. గుంపులుగా తిరిగే సింహాలు సయితం ఆకలిబాటలో సాగే తోడేళ్ళ మందకు అడ్డుగా వెళ్ళే సాహసం చెయ్యవు.

చుట్టూ చూశాడు రాజు. బాగా ఎత్తయిన బండరాతిని చూపిస్తూ "అంతా దాన్ని ఎక్కండి" అన్నాడు. సుమారు ఏడెనిమిది అడుగులు ఎత్తులో వుందా బండ. తోడేళ్ళ బారినుండి తమనుతాము రక్షించుకునేందుకు అంతకుమించి మరో దారే లేదక్కడ. అందరూ ఆ వూపున ఎగిరి బండరాతిమీదకు చేరిపోయారు.

బల్వంత్ ఒక్కడే భారీ శరీరం కారణంగా ఎక్కలేకపోయాడు. బండమీద జారిపోతున్న అతని చేతుల్ని పట్టుకున్నాడు రాజు. మిగిలిన ముగ్గురూ బల్వంత్ చేతుల్ని పట్టి అతన్ని పైకిలాగే ప్రయత్నంలో వుండగా అదే సమయానికి మందలో ముందున్న తోడేళ్ళు అతన్ని సమీపించేసాయి.

ఒక తోడేలు బల్వంత్ పేంటు చివర్న పట్టుకుంది. అయినా పట్టు విడకుండా తోడేలును బల్వంత్‌తో సహా పైకి లాగేసారు ఆ నలుగురూ. ఫేంటు మధ్యలో చిరిగి ఆ ముక్కతో బాటు కింది పడింది తోడేలు.

తోడేళ్ళు బండరాతిమీదకు ఎగిరేందుకు ప్రయత్నిస్తున్నాయి. అవి ఇంచుమించు పైకి వచ్చిరావడంలో తిరిగి కిందకు జారిపోతున్నాయి. పరుగెత్తే కార్యక్రమంలో అందరి చేతుల్లో వుండే నూదికర్రలు దారిలోనే

జారిపోయాయి. రాజు ఒక్కడి దగ్గరే వుంది చాకు. వారందరికీ వున్న ఆయుధం అదొక్కటే ఇప్పుడు. రాజు చాకును చేతబట్టి అందరికీ ముందున్నాడు.

తోడేళ్ళు రెండు ఏదోలా కష్టపడి బండ మీదకు రాగలిగాయి. రాజు ఏమాత్రం ఆలస్యం చేయక వాటిని అందిన ప్రతిచోటా పొడిచేశాడు. బల్వంత్ అదే సమయంలో వాటిని తిరిగి మందలోకి తన్ని తోశాడు. రక్తధారల మధ్య గిలగిల కొట్టుకుంటున్నాయి ఆ తోడేళ్ళు రెండూ. కొద్ది క్షణాల్లో తోడేళ్ళ మంద రాజు బృందంమాటే మరచి మృత్యుముఖంలో వున్న తమ నేస్తాలమీద విరుచుకుపడింది. ఒకదానితో ఒకటి పోటీపడుతూ తోడేళ్ళన్నీ ఆ రెండు తోడేళ్ళనూ చీల్చుకు తినసాగాయి.

అదే తాము తోడేళ్ళ బారినుండి తప్పుకుపోయే సమయమని భావించి రాజు బృందం చడీ చప్పుడు లేకుండా వెనకనుండి బండరాయి దిగి పరుగు అందుకుంది. తీవ్రమైన ఎండనూ వేడిగాలుల్ని లెక్కచెయ్యకుండా ఇక ముందుకు అడుగు వేయడం సాధ్యపడదన్నంతవరకూ వారలా పరుగెడుతూనే వున్నారు.

చిన్న సెలయేరొకటి ప్రవహిస్తూ వారి దారి కడ్డం వచ్చింది. ఏరుదాటి అవలి ఒడ్డు చేరారంతా. కడుపునిండా నీళ్ళు తాగి వేడి తాపం తగ్గేలా స్నానాలు చేశారు. దాపున వున్న చెట్ల నీడలో విశ్రమించారు. వారి దృష్టి మాత్రం అనుక్షణం తాము వచ్చిన తోవమీదే వుంది. అయితే తోడేళ్ళు కానరాలేదెక్కడా.

"ప్రస్తుతానికిక వాటిప్రమాదం మనకు లేనట్టే" అన్నాడు రాజు. అంతా దీర్ఘంగా నిట్టూర్చారు.

వేడి తీవ్రత కొద్దిగా తగ్గగానే తిరిగి ప్రయాణం కొన

సాగింది. సాయంత్రం వరకూ ఏ అడ్డంకీ లేకుండా గడిచింది. "ఇక యే గుహలో గూడో చూసుకోవాలి" నిట్టూరుస్తూ అన్నాడు బల్వంత్ రాయ్. అప్పటికి చలిగాలులు తమ రాకను కొద్దికొద్దిగా ప్రారంభించాయి.

5

వెతికి వెతికి ఒక కొండచరియలో వున్న గుహను కనిపెట్టారు.

గుహ బయట అంతా గడ్డి, చిన్న చిన్న మొక్కలూ గజిబిజిగా వుంది ఆ ప్రదేశం. రాజు ముందు నడుస్తున్నవాడల్లా గుహ ప్రవేశ ద్వారం ఇంకా ఓ పదడుగులు వుండనగా ఆగిపోయాడు. నేలమీద ఏదో జంతువు పాదాల గుర్తులు! అవన్నీ ఇంచుమించు గుహలోకే దారితీశాయి.

చీకటి పడేందుకు ఇక ఎంతో వ్యవధి లేదు. ఆ పరిస్థితిలో మరో గుహను వెదుక్కోవడం కష్టంతో కూడిన పని. అలాగని గుహలో అడుగుపెట్టేందుకు ధైర్యమూ చాలడంలేదు.

ఈ గుర్తులు యే మృగానివో తెలియదు. అడుగుల్ని బట్టి చాలా పెద్ద జంతువే అనిపిస్తోంది. కొంచెం కష్టపడితేనేం మరో గుహను వెతుక్కోవడమే క్షేమం. ఆ భావనతో అందరూ వెనక్కి తిరిగేంతలో వూహించిన ప్రమాదం రానే వచ్చింది గుహ లోపలినుంచి.

సుమారు మూడడుగుల ఎత్తూ ఐదడుగుల పొడవూ వున్న సింహం జూలువిదిలిస్తూ నిలిచి వుంది. ఏనుగుతలంత వుంది దాని తల. శరీరంలో ఎక్కడా ఎముక కనపడనంత బలిష్టంగా భయంకరంగా వుంది. పట్టణాలలోని సర్కస్ సింహాలను మాత్రమే చూసివున్న వాళ్ళంతా ఆ సింహాన్ని

చూసి అదిరిపోయారు. ఎవరికీ ఏదీ తోచక ఎక్కడి వాళ్ళక్కడ కొయ్యబారిపోయారు.

సింహం అప్పుడే ఆహారంకోసం బయలుదేరినట్టుంది. బాగా ఆకలిమీద వున్నట్టు దాని వాలకమే చెబుతోంది. రెండడుగులు ముందుకు వేసింది.

“ఎవరూ వెనుతిరిగే ప్రయత్నం చెయ్యొద్దు.” సింహం మీదనుండి దృష్టి మరల్చకుండానే అన్నాడు రాజు హెచ్చరికగా. సింహం మరీ చేరువలో వుంది. వెన్ను చూపితే దానికి మరింత లోకువ కావడం తప్ప తమలో కొందరయినా హతంకాక తప్పరు. ఈ పరిస్థితిలో దానితో వీరోచితంగా పోరాడి చావడమే మేలు. ఒకరిద్దరు మిగిలినా ఏదో నాటికి ఇలాంటి దిక్కుమాలిన చావే తప్ప మరో దారేదీ లేదిక్కడ. అందరి ఆలోచనలూ ఒకేలా వున్నాయి. ఎవరూ ఓ అడుగన్నా వెనక్కి నడవలేదు.

సింహం గడ్డిదుబ్బుల మీదుగా మరో రెండడుగులు వేసింది. ప్రత్యర్థులు స్థిరంగా నిలుచోవడం దానికీ అయోమయంగా వుంది. సింహం మరో అడుగు వేసింది. కోరలు చాచి గుర్రుమంది.

హఠాత్తుగా గడ్డిపొదలో ఏదో కదలిక “బుస్స్.... స్స్....”మనే గాలిచప్పుడూ వినపడింది. సింహం త్రుళ్ళిపడుతూ ప్రక్కకు గెంతింది. అదే సమయంలో గాల్లోకి విసురుగా లేచిన నల్లని సర్పాకృతి సింహం ముందుకాలు మీద తన తలతో రెండుసార్లు పొడిచింది. దెబ్బతిన్న సింహం కోపంతో గర్జిస్తూ సర్పంమీదకు దూకింది.

కారు నలుపులో ఉండే ఆ విషసర్పం మోచేతి లావున ఏడూ లేక ఎనిమిదడుగుల పొడవున నిగనిగ

లాడుతోంది. సింహం దాని తలను చటుక్కున కొరికి పారేసింది. విషసర్పం తలా మొండెం వేరయి కొట్టు మిట్టాడుతూ ఉండగా విజయగర్వంతో రాజు బృందం కేసి తిరిగింది సింహం.

విషసర్పం కాటుపడిన కాలు ఎక్కడిదక్కడే ఉండి పోగా సింహం ప్రక్కకు పడిపోయింది. సింహం తిరిగి లేచేందుకు ప్రయత్నించింది. ఫలించలేదు. సింహం ఆకృతిలో అప్పటికే మార్పు వచ్చేసింది. బూడిదరంగు వర్ణం క్రమేపీ నల్లబడి పోతోంది. విషం క్షణాలమీద పని చేసింది. సింహం నురగలు కక్కుతూ ప్రాణాలు విడిచింది.

రాజు బృందం హాయిగా నిట్టూర్చింది. "మనం చాలా అదృష్టవంతులం. చెప్పాలంటే ఈ సింహం చేతిలోనో, పాముకల్లనో మనలో కొందరయినా చావాల్సిన వాళ్ళం" అన్నాడు బల్వంత్ రాయ్ నుదుటపట్టిన చెమటను తుడుస్తూ.

రాజు గుహలో వెళుతూ వుండగా "ఇంక లోపల ఏమీ లేవకదా?" అన్నాడు ప్రకాష్ అనుమానంగా.

రాజు నవ్వుతూ "ఆ భయమేదీ అక్కర్లేదు. సింహం నివసించే గుహలో మరో ప్రాణి అడుగు పెట్టదమే!" అన్నాడు.

రాజు చెప్పినట్టుగానే లోపల మరే జంతువూ లేదు. కాకపోతే ముక్కులు అదిరే గబ్బు వాసన దారుణంగా ఉంది. అయినా తప్పదు. బయట చలిలో చచ్చేకన్నా ఇది నయమే కదా. కొద్దిసేపట్లోనే వారు ఆ వాసనకు అలవాటు పడిపోయారు.

6

ఆలా నాలుగయిదు రోజులు సాగింది వారి ప్రయాణం.

ఈ లోగా వాతావరణంలో చెప్పుకోదగ్గ మార్పు వచ్చింది. మునుపటిలా చలీ వేడీ లేదిక్కడ. అంతా ఎర్రని బుగ్గి నేల. గాలివేస్తే చాలు పైకి లేస్తోంది ఎర్రని ధూళి. ఆ ప్రదేశంలో ఓ అరగంట నడిచినందుకే అందరూ ఎఱ్ఱమట్టిలో కొట్టుకుపోయినట్టు తయారయ్యారు.

"ఛీ! ప్రపంచంలోని దరిద్రమంతా ఈ దీవి పుణికి పుచ్చుకుంది...." చిరాకుపడిపోయాడు బల్వంత్. ఇంతలో రణగొణ ధ్వనులతో కొన్ని పరిచిత స్వరాలు వినపడి ఉలిక్కిపడ్డారంతా.

"చచ్చాం! ఆ పిశాచాలు మనల్ని వదల్లేదింకా. పరుగెత్తండి" అరిచాడు బల్వంత్ ఆందోళనగా.

బల్వంత్ తన మాటల్ని పూర్తిచేస్తున్నంతలో ప్రత్యక్షమయ్యాయి తోడేళ్ళు. పొట్టలు వెన్నముకకు అంటివుండగా చోరలు విరుచుకొని వాయువేగంతో దూసుకువస్తున్నాయి.

రాజు బృందం శక్తికొద్దీ పరుగుతీస్తోంది. చెట్టూ చేమ మాటేలేదు. కనీసం రాయి రప్పయినా జాడలేదు. ఈసారి తోడేళ్ళ బారినుండి పడక తప్పదేమోననే భయం రాజు బృందాన్ని పీడిస్తోంది. అయినా బ్రతుకు తీపి వారిని ముందుకు పరుగెత్తిస్తోంది. తోడేళ్ళు తమ వేగాన్ని క్రమేపీ పెంచుతున్నాయి.

తోడేళ్ళకూ రాజు బృందానికీ మధ్యదూరం బాగా తగ్గిపోయింది. ఐదుగురూ ఆయాసంతో రొప్పుతున్నారు. కాళ్ళు బిగుసుకుపోయి అడుగులు తడబడుతున్నాయి

"తమ పని అయిపోయిందిక" అనుకున్నారంతా.

ఇంతలో వారి దారికి అడ్డంగా ప్రవహిస్తూ ఒక నది ప్రత్యక్షమయింది. నదిలో నీరు కొంచెం ఎర్రగా వుంది. సుమారు నూటయాభై అడుగుల వెడల్పుంటుందా నది. నదికి అవల కోటగోడల్లా నిలువుగా వున్నాయి నలభై యాభై అడుగుల ఎత్తులో కొండరాళ్ళు. అవతల వాటిని ఎలా అధిరోహించాలనే ఆలోచనే లేకుండా రాజు బృందమంతా వరుసగా నదిలో దూకేసారు.

తోడేళ్ళు ఓ క్షణం ఆలస్యంగా ఒడ్డు చేరాయి. రాజు వెనక్కి తిరిగి చూశాడు. తోడేళ్ళుకూడా నదిలో దిగితే తమకిక వేరే దారిలేదు. అయితే ఏం అదృష్టమో తోడేళ్ళు నీటి ఛాయలకే రాలేదు. "బ్రతుకు జీవుడా" అనుకున్నారంతా.

ఈదుతూ ముందుకు సాగుతున్నారు. ఇప్పుడు వారి ఆలోచనంతా నిట్టనిలువుగా వున్న ఆ కొండరాళ్ళను ఎక్కడెలా? అనే.

అయితే, తోడేళ్ళబారినుండి తప్పించుకునే ఆత్రంలో నదిలో దిగుతూ, ఒడ్డున దట్టంగా ఉన్న పొదల్ని వారు గనక మొదటే గమనించి వుంటే నదిలో దిగడంకన్నా తోడేళ్ళతో పోరాటమే నయమనే వారు. ఏమయితేనేం ఇప్పుడు వారికా అవకాశమే లేదు. నదిలో కలిగిన అల జడికి పొదలమధ్య నిస్త్రాణంగా నిద్రపోతున్న మొసళ్ళలో అలజడి చెలరేగింది.

ఇంచుమించు పదిహేనూ ఇరవై అడుగుల పొడవున్న మొసళ్ళు ఓ పాతిక వరకూ వున్నాయక్కడ. వాటిల్లో ఓ పదికి తక్కువలేకుండా చకచకా ఉరికాయి నీటిలోకి.

నీటిమట్టానికి సమతలంగా బాణాల్లా తమ వెనక దూసుకువస్తున్న ఆ మొసళ్ళను ముందుగా చూసింది రాజు. తోటేళ్ళు తమతో బాటు నది నీటిలో యెందుకు అడుగు పెట్టలేదో అప్పుడర్థమయిందతనికి.

"ఈదండి త్వరగా! మొసళ్ళు!" అరిచాడు రాజు.

అందరూ వులిక్కిపడుతూ తలలు వెనక్కి తిప్పారు. గుండెలు బేజారెత్తిపోగా మరింత వేగంగా ఈదసాగారు. ఎంత లేదన్నా తీరం ఓ అరవై అడుగుల్లో ఉంది. మొసళ్ళు తమకంటే ఓ ఇరవై అడుగులు వెనకబడి ఉన్నాయి. మహా అయితే మరో నిమిషమో అరనిమిషమూ! అయిపోయింది తమ పని. ఇన్ని కష్టాలుపడి ఇంత దూరం వచ్చి చివరకు ఆ మొసళ్ళ నోటిలో దారుణమయిన చావు..వునూరుమంటున్నాయి అందరి మనసులూ.

మొసళ్ళు దరిదాపు కొచ్చేసాయి. వినవస్తోంది నీటిలో వాటి చప్పుడు. వెనక్కి తిరిగి చూసే ధైర్యం లేదెవరికీ. ఆ చల్లని నీటిలో సయితం చెమటలుపట్టే అనుభూతి!

ఇంతలో వినవచ్చాయి "ఢాం....ఢాం...." అంటూ దిక్కులు అదిరేలా తుపాకీల చప్పుళ్ళు. గుళ్ళుఇంచుమించు వాటికి వెనగ్గా సరాసరి దూసుకుపోతున్నాయి ఎడతెరిపిలేకుండా. ఏం జరుగుతోంది. ఎక్కడి నుండి ఆ తుపాకీల మోత! అంతా అయోమయంగా వుంది.

ఆత్రంగా వెనక్కి తిరిగి చూశారంతా! మొసళ్ళు కొన్ని నీటిమీద తేలుతున్నాయి వెల్లకిలా. మరికొన్ని మృత్యువు వాతపడి గిజగిజలాడుతున్నాయి. ఆ ప్రదేశమంతా వాటి రక్తంతో ఎర్రనయి ఉంది. మొసళ్ళలోయే ఒక్కటీ మిగలకుండా చచ్చినట్టే లెక్క.

ఆనందం పట్టలేక రాజు బృందం ముందుకు సాగారు. కొండరాళ్ళ మీద నిలుచుని సుమారు పదిహేనుమంది వ్యక్తులు చేత తుపాకులు ధరించి వుండడం కనిపించింది. రాజు బృందం కృతజ్ఞతగా చేతులు ఊపారు. ఈదుతూ వారంతా బండరాళ్ళను సమీపించగానే పైనుండి తాటి నిచ్చెనలు వేశారా వ్యక్తులు. రాజు బృందం నిచ్చెనల ద్వారా పైకిచేరారు.

బాగా పెరిగిన గడ్డాలూ మీసాలూ....దృఢంగా వున్నారందరూ. ఛాతీకి అడ్డంగా తూటాలతో నిండిన బెల్టులు ధరించారు. ప్రతిఒక్కరి చేతిలోనూ తుపాకి, నడుముకు పెద్ద కత్తి వేలాడుతున్నాయి. ధరించిన దుస్తులు మట్టి కొట్టుకుపోయి వున్నాయి. ఏ ఒక్కరి మొహంలోనూ నవ్వు లేశమయినా లేదు. చూపులు కఠినంగా భయం గొలిపేట్టున్నాయి.

రాజు బృందం మొహాలమీద వెలిగే చిరునవ్వు మాయమయ్యింది. వీళ్ళు సముద్రపు దొంగలు! చెప్పాలంటే వీరికన్నా ఆ తోదేళ్ళు, మొసళ్ళే ఒకింత నయం.

వారిలో ఒకడు ముందుకొచ్చి అర్థంకాని భాషలో ఏదో అడిగాడు. రాజు బృందం మొహాలు చూసుకున్నారు. వాడే తిరిగి "ఇంగ్లీష్!" అన్నాడు. అది మీకు తెలుసా అన్నట్టు. తెలుసన్నట్టు తలూపాడు రాజు. వాడు తన మనుషుల్లో మరొకణ్ణి పిలిచాడు.

ఆ వ్యక్తి ఇంగ్లీషులో "మీరెవరు, ఇక్కడికెలా వచ్చారు" అని ప్రశ్నించాడు. రాజు అతడికి తమ కథ యావత్తూ సవివరంగా చెప్పాడు. ఆ వ్యక్తి మొదటి వ్యక్తికి రాజు చెప్పింది తమ భాషలో వివరించాడు. ఆ మాటలు అతనికి సంతృప్తి కలిగించినట్లున్నాయి.

మౌనంగా తల వూపుతూ ఏదో చెప్పాడు.

అతడు చెప్పిన మాటల్ని అనువదిస్తూ రెండో వ్యక్తి ఇంగ్లీషులో "మిమ్మల్ని మా బాస్ ముందు హాజరు పెడతాం. ఏం జరిగేదీ అతడే నిర్ణయిస్తాడు" అన్నాడు రాజుతో. రాజు నిట్టూరుస్తూ తల ఊపాడు. తల ఊపక చేసేదేంలేదు. కాదంటే కాళ్ళూ చేతులూ నరికి తీసుకు పోతారు.

సముద్రపు దొంగలు రాజు బృందంలో ప్రతిఒక్కరినీ శోధించి రాజు దగ్గర వుండే ఒకే ఒక చాకును తీసుకున్నారు. ముందూ వెనక సాయుధులయిన సముద్రపు దొంగలు వారిని అనుసరించగా బయల్దేరారు.

ఇంచుమించు అంతా రాళ్ళూ పర్వతాలతో నిండిన ప్రదేశమది. పైకి కనపడని విధంగా ఆ పర్వత సానువుల్లో రహస్య స్థావరాలు నిర్మించబడ్డాయి. కీలకమయిన ప్రదేశాల్లో అక్కడక్కడా సాయుధులయిన వ్యక్తులు పహారా కాస్తున్నారు. సముద్రపు దొంగలు ప్రతిచోటా గుమిగూడి రాజు బృందాన్ని వింతగా చూస్తున్నారు.

అలా చాలాదూరం నడిచారు వాళ్ళు. ఓ ఫర్లాంగు దూరంలో సముద్రం కనిపిస్తోంది. "అంటే తామిప్పుడు దీవి అవలిఒడ్డు చేరామన్నమాట" పరిసరాలను ఆసక్తిగా గమనించసాగాడు రాజు.

వృక్షాలు అసలు ఎండ ఏమాత్రం చొరశక్యం కానంత దట్టంగా వున్నాయక్కడ. వాటి దిగువన కొన్ని పక్కా ఇళ్ళు నిర్మించబడ్డాయి. రాజు బృందాన్ని సముద్రపు దొంగలు అటువంటి ఒక గృహంలో బంధించి వెళ్ళిపోయారు. ఆ గృహాన్ని నలుగురు సాయుధులయిన వ్యక్తులు కాపలా కాస్తున్నారు.

కొంత సేపయ్యాక తిరిగి తెరవబడ్డాయి తలుపులు. పెద్ద పెద్ద పళ్ళాలతో లోనికి వచ్చారు కొందరు. వాటిని గదిలో వుంచి తలుపులు వేసేశారు. పళ్ళాలనిండా వేయించిన కోడి మాంసం, గ్రుడ్లూ, పళ్లూ వున్నాయి. ఆకలి జ్ఞాపకం వచ్చింది వారికి. బాధలన్నీ మరచి వాటి మీద విరుచుకుపడ్డారు ఐదుగురూ.

7

మరుసటి రోజు ఉదయమే వారిని బాస్ దగ్గరికి తీసుకుపోయారు సముద్రపు దొంగలు.

రూసో! వారి నాయకుడు. పర్వతంలా వున్నాడు. ఏనాడూ దువ్వెన, నూనె అనే మాటే లేనట్టు ముళ్ళ పొదలా వుందా తల. గడ్డం మీసాలూ అంతే! తెగబారెడున్నాయి.

రూసోకి వివరాలన్నీ ముందే తెలిసినట్టున్నాయి. "మీలో కేప్టెన్ ఎవరు?" అని ప్రశ్నించాడు. నేను అన్నట్టు తలూపాడు రాజు. మిగిలిన వాళ్ళను సయితం పరిచయం చేశాడతనికి.

"గుడ్!" నవ్వాడు రూసో.

"కేప్టన్! మాకిది నిజంగా నమ్మశక్యం కాని విషయం. వెదుకపోయిన తీగ కాళ్ళకు తగిలినట్టుంది. చెప్పాలంటే మేమిప్పుడు మీలాంటి వాళ్ళకోసం ఎన్నో విధాలుగా ప్రయత్నిస్తున్నాం. విచిత్రంగా మీరే మా వద్దకు వచ్చారు" అన్నాడు రూసో ఇంగ్లీషులో.

రూసో మాటలు వారెవరికీ అర్థంకాలేదు. అయోమయంగా చూశారతని వేపు. రోసో నవ్వుతూ "మీకంతా వివరంగా చెబుతాను. నా వెంటరండి" అంటూ కుర్చీలో నుండి లేస్తూ "ఒక విషయం, మీరిప్పుడు మా గెస్టులు.

ఎటువంటి భయాలూ లేకుండా మీరిక్కడ నిశ్చింతగా వుండొచ్చు" అని చెప్పి నడిచాడు ముందుకి.

రాజు బృందం అతన్ని అనుసరించింది. వారి వెంట సాయుధులయిన రూసో బాడీగార్డులు ఇద్దరు నడిచారు.

అలా నడుస్తూ వారంతా ఒక విశాలమయిన షెడ్డు ముందాగారు. రూసో ముందుగా నడుస్తున్న వాడు ఒక్కసారి వెనక్కి తిరిగి రాజుతో "ఇక్కడ మాకిదో పెద్ద అమ్యూజ్ మెంట్ ప్లేస్. మనసు మరీ చికాకుగా వున్నా, పట్టరాని ఆనందంతో నిండివున్నా ఇక్కడికి వస్తాను" అన్నాడు పెద్దగా నవ్వుతూ. రూసో నవ్వినపుడల్లా వారంతా ఉలిక్కిపడుతూనే వున్నారు. "వీడూ వీడి నవ్వూనూ ఎలుగ్గొడ్డు వెధవ" మనసులో విసుక్కున్నాడు బల్వంత్.

రూసో షెడ్ లో అడుగుపెట్టాడు. రాజు బృందం అతని వెంట నడిచింది లోనికి. చాలా పెద్ద హాలది. లోపల దృశ్యాల్ని చూసి కొయ్యబారి పోయారంతా.

రూసో మాటల్నిబట్టి అక్కడన్నీ యేవేవో సుందర దృశ్యాలను వూహించుకుంటున్న రాజు బృందానికి ఆ దృశ్యాలను చూసి నిజంగానే మతిపోయింది.

హాలు సగభాగం ఒడలు గగుర్పాటు చెందే దారుణమయిన విషసర్పాలున్నాయి. అవన్నీ బలమయిన విశాలమయిన అద్దాల కేసుల్లో బుసలుకొడుతూ తిరుగుతున్నాయి. ఒకచోట ఇనపవూచల బోనులో సుమారు పదిమీటర్ల పొడవున బ్రహ్మాండమయిన కొండచిలువ అప్పుడే బోనులో వదలిన పొట్టేలుమీద పడబోతోంది.

కొండచిలువ బలమయిన అరటిబోదెను మించిన లావుంది. పొట్టేలు తెల్లని బొచ్చుతో అందంగా వుంది.

కొండచిలువ బారినుండి తప్పించుకుపోయే ప్రయత్నంలో బోను చుట్టూ పరుగులు పెడుతోంది.

కొండచిలువ పొట్టేలును తన తోకతో కాళ్ళమీద కొట్టింది. బలమయిన వ్యక్తి మోచేయంత లావుంది దాని తోక చివర. పొట్టేలు దభీలున పడింది కింద. పొట్టేలు తిరిగి లేచేలోగా కొండచిలువ తన తోక భాగాన్ని దాని శరీరానికి నాలుగు చుట్లు చుట్టింది.

పొట్టేలు దీనంగా అరుస్తోంది. రూసో ఆనందం పట్టలేక చప్పట్లు చరిచాడు. షెడ్డు పైకప్పు ఎగిరేలా నవ్వసాగాడు.

కొండచిలువ తోకను తనవద్దకు లాక్కుంటోంది. పొట్టేలు శరీరం చుట్టూ కొండచిలువ శరీరం చుట్లు మరింత ఎక్కువయ్యాయి' చుట్లు బిగుసుకుంటున్నాయి బలంగా. పొట్టేలు శరీరం వాటిల్లో నలిగి నుజ్జుయిపోయింది. కొండచిలువ తన నోటిని చాచింది. కోరలూ నాలుకా వెలుపడి ఆ నోరు పర్వత గుహలా యెర్రగా మెరుస్తోంది. కళ్ళు జ్యోతుల్లా మెరుస్తున్నాయి.

పొట్టేలు ఆ నోటిలో సునాయాసంగా పట్టేసింది. కొండచిలువ శాంతించింది. నెమ్మదిగా సర్దుకొని ఓ మూలకు చేరి ప్రశాంతంగా ఏమీ ఎరగనట్టు, అసలీ లోకమే తనకు తెలియనన్నట్టు నిద్రపోతోంది.

"అద్భుతం కదూ!" సంబరంగా అన్నాడు రూసో. రాజు బృందం యెవరూ మాట్లాడలేదు. తలలు ప్రక్కకు తిప్పుకున్నారు.

రూసో నవ్వుతూపోయి ఓ అద్దాల షో కేసులాంటి దానిముందు నిలుచున్నాడు. నల్లని ఆకుపురుగుల్లాంటివి, వేల సంఖ్యలో షో కేసు లోపల అద్దాలమీద ప్రాకుతూ

అసహ్యంగా వున్నాయి చూసేందుకు. సుమారు అంగుళం పొడవూ అరంగుళం మందం వున్నాయి.

ఇంతలో ఏడ్పులు, అరుపులతో కూడిన స్త్రీ స్వరం వినపడింది. అంతా అటు తిరిగారు. ఇద్దరు దున్నపోతుల్లాంటి వ్యక్తులు ఓ స్త్రీని బలవంతంగా ఈడ్చుకొస్తున్నారు. ఆమె శరీరంమీద యెటువంటి ఆచ్ఛాదనా లేక దిగంబరంగా వుంది. ఆమె దుస్థితి చూసి రాజా పిడికిళ్ళు ఆవేశంతో బిగుసుకున్నాయి.

బల్వంత్ తొందర కూడదన్నట్టు తన చేతిని రాజా భుజంమీద వేసి నొక్కాడు. ఆ యువతి శరీరం యేదో పసరు పూసినట్టు పచ్చగా వుంది.

బల్వంత్ వణికే స్వరంతో చెబుతున్నాడు నెమ్మదిగా. "రాజా! ఇదొక పైశాచిక కృత్యం. అద్దాల కేసులో వున్నవి ఆఫ్రికా అడవుల్లో వుండే ఒక రకమయిన పురుగులు. నిజానికి అవి మనుషులకు హాని కలిగించేవేం కావు. అయినా వాటి స్పర్శ మానవ శరీరానికి నరక ప్రాయం. ఇపుడామె ఒంటిన పూసిన పసరు వాసన ఆ పురుగులకు మహా ప్రీతి. వాసనబట్టి పురుగులు శరీరం మీద ప్రాకుతూ వుంటాయి. ఆ స్పర్శ కారణంగా మనిషి శరీరం విపరీతమయిన సలుపూ మంటకు లోనవుతుంది. ఎలాంటి మనిషయినా తన శరీరంమీద ఇటువంటి పురుగును ఒక్కటంటే ఒక్కటి భరించలేని పరిస్థితుల్లో ఇన్ని పురుగులు ఒకేసారి పైనబడితే....ఓహ్....ఊహించు ఆ బాధ...." అన్నాడు బాధగా.

యువతి చేతుల్ని తాళ్ళతో కట్టి వాళ్ళిద్దరూ ఆమెను బలవంతంగా అద్దాల కేసులో తోసేసారు. ఆమె భయంతో పురుగుల్ని చూస్తూ అరుస్తోంది. పురుగులు

వందల సంఖ్యలో ఆమె శరీరాన్ని ఎగబ్రాకుతున్నాయి. ఆమె బాధ భరించలేక గింజుకుంటోంది. ఏడుస్తోంది. పురుగులు ఆమె శరీరాన్ని పూర్తిగా ఆక్రమించేసాయి. ఆ స్థితిలో రూసో ఆనందం మరి చెప్పనలవికాదు. సంతోషంతో వూగిపోతూ గంతులు వేస్తున్నాడు.

రాజా బృందం కళ్ళు మూసుకున్నారు బాధగా. అవతల ఆ యువతి అరచి అరచి స్పృహ తప్పి పడిపోయింది. ఆమె శరీరం కిందపడి ఎన్నో పురుగులు నలిగి నాశనమయ్యాయి. అయినా లెక్కచేయకుండా వున్న ఆ పురుగులు ఆమె ఒంటిని ఇంకా అంటిపెట్టుకునే తిరుగుతున్నాయి.

సున్నితమయిన ఆమె శరీరం ఆ బాధను తట్టుకోలేక రెట్టింపు వాచిపోయింది. మల్లెపూవులాంటి దేహం కంది పోయి ఎర్రగా మారింది. నోటినుండి నురగలు వస్తున్నాయి. ఆ స్థితిలో ఆమెను లోనికి నెట్టిన వ్యక్తులు తిరిగి ఆమెను బయటకు తెచ్చారు. గ్లౌజులు తొడిగిన చేతులతో ఆమె ఒంటిమీద వున్న పురుగుల్ని ఏరి అద్దాల కేసులో వేసారు. ఇంత జరుగుతున్నా ఆమెలో ఉలుకూ పలుకూ లేదు. చచ్చిన దానిలా పడి వుంది.

"ఆమె చనిపోయిందా?" అనుమానం దాచుకోలేక అడిగాడు రాజా నెమ్మదిగా.

ఫకాలున నవ్వాడు రూసో. "ఒక్క రోజుకే ఈమె చనిపోతే మరి రోజా మాకు గడిచేదెలా?" అన్నాడు అదో పెద్ద జోక్‌లా తిరిగి మరోసారి నవ్వుతూ. వాణ్ణి అక్కడికక్కడే బట్టలు విప్పి ఆ అద్దాల కేసులో తోసేద్దామన్నంత కోపం వచ్చింది వారందరికీ. కోపాన్ని బలవంతాన నిగ్రహించుకొని రూసో పిలుస్తున్నా వినకుండా

బయటకు వచ్చేశారంతా.

రూసో వారిని వెన్నంటి వచ్చి బయట నిరాశగా "మీకు ఇంకా ఎన్నో చూపించాలనుకుంటే తొందరపడి వచ్చేసారు. ఏం చేస్తాం. మరి నడవండి. పోదాం" అంటూ ముందుకు దారితీసాడు. రాజు బృందం మాట్లాడకుండా అతణ్ణి అనుసరించింది.

రూసో ఈ దృశ్యాలను తమకిప్పుడు యెందుకు చూపించినట్టు? తను తమద్వారా ఏదో సాధించాలని చూస్తున్నాడు. అందుకు తాము అభ్యంతరం చెప్పకుండా వుండేందుకు ముందుగానే హెచ్చరిస్తున్నాడన్నమాట! ఇంతకీ యేమిటా కార్యం?

రూసో వారిని సముద్రతీరం వెంబడి నడిపించాడు. తీరాన్ని ఆనుకొని వున్న రెండు పర్వతాల మధ్య సముద్రపు నీటితో యేర్పడి వుందొక కాలువ. కాలువ అంచున సహజంగా కొండరాళ్ళతో జెట్టీలాంటిది వుంది. రాళ్ళమధ్య ఖాళీలను మట్టితో పూడ్చారు. ఆ జెట్టీకే కట్టబడి వుందొక డెస్ట్రాయర్ యుద్ధ నౌక. పేరు హెర్క్యులిస్. నౌకమీద సాయుధులయిన సముద్రపు దొంగలు పహారా కాస్తూ అటూ యిటూ తిరుగుతున్నారు. పర్వతాల మధ్య వున్న కారణంగా యుద్ధనౌక పైకి కనపడదు సాధారణంగా. అదీగాక పర్వతాలు సయితం దట్టమైన చెట్లతో నిండివున్నాయి.

రాజు ఆశ్చర్యపోతూ "ఇది మీకెలా లభ్యమయింది?" అన్నాడు.

ఆ ప్రశ్నకు పొట్ట పైకీ కిందికీ లబలబలాడేలా పకపక నవ్వాడు రూసో. "సముద్రపుదొంగలకు నీటిలో అసాధ్యమంటూ వుండదు. ఇదొక అమెరికన్ యుద్ధ నౌక.

చెప్పాలంటే అదో పెద్ద కథ.

నిజానికి యీద నౌకలతోసహా ఎటువంటి నౌకలూ ఈ దీవి చుట్టుప్రక్కలకు రావు. సముద్రయానానికి అనుకూలంకాని ప్రమాదభరితమయిన మార్గమిది. ఇక్కడ సముద్ర గర్భంలో వుండే నూదికొండలు ఈ ప్రాంతానికి పరిచయమున్న వ్యక్తులకే తెలుస్తాయి. అలా పొరపాటున వచ్చిన నౌకలెన్నో నూదికొండలకు బలయిపోయాయి.

అందుకే నావికులు ఈ పరిసరాల పేరు చెబితేనే హడలిపోతారు. పూర్వం ఎప్పుడో బ్రిటిష్ సైన్యాలు ప్రాణాలకు తెగించి చిన్న చిన్న పడవలమీద దండెత్తి వచ్చి మా పూర్వీకుల్ని దొరికినవాడినల్లా చంపేసారు. పిల్లా పీచూ ముసలీ ముతకా అనే తేడా లేకుండా బ్రిటిష్ సైనికులతో వీరోచితంగా పోరాడారు మా వాళ్ళు.

బ్రిటిష్ సైనికులు సంఖ్యలో మా వాళ్ళను మించి వున్నారు. అధునాతనమయిన ఆయుధాలతో సర్వసన్నద్ధంగా వచ్చారు. వాళ్ళ ధాటికి తట్టుకోలేక మా వాళ్ళు చెల్లాచెదురయ్యారు. చచ్చిన వాళ్ళు చావగా బహు కొద్దిమంది మాత్రం తప్పించుకోగలిగారు. అటువంటి వారిలో మా తండ్రి ఒకడు. నాలుగేళ్ళ పసివాడినయిన నన్ను వీపున యెక్కించుకొని సముద్రంలో దిగిపోయాడు. అలా ఏకధాటిగా ఒక రాత్రంతా నన్ను వీపున మోస్తూ నీటిలో ఈదాడాయన. ఇక మా పని క్షణాల్లో వుందనగా తెల్లవారు జామున ఒక చిన్న బోటులో పోతున్న మా జాతివాళ్ళే మమ్మల్ని కాపాడారు.

నా తల్లీ తదితర స్త్రీలు ఈ దీవిమీదే బ్రిటిష్ సైనికులకు దొరికిపోయారు. వారందరినీ ఆ కసాయివాళ్ళు

సామూహికంగా చెరచి మరీ చంపేసారు.." ఆ మాటలు చెబుతూ రూసో ఆవేశంతో వణికిపోయాడు. పిడికిళ్ళు బిగించాడు....

"మిష్టర్ రాజా! అదే పని మావాళ్ళు చేస్తే క్రూరత్వమంటారు. అనాగరికమంటారు. కానీ ఆ నీచపు పని బ్రిటిష్ నాగరిక సైనికులు చేసింది గనక లోకమంతా వారిని మెచ్చుకుంటూ సముద్రపు దొంగలకు సరయిన శాస్తి జరిగిందని పండుగ చేసుకుంది.

నిజమే! మావాళ్ళు కసాయివాళ్ళే. అనాగరికులే. కాదనను. కానీ నాగరికులు మాత్రం చేసిందేమిటి? అందుకే చిన్నతనంనుండీ నేను ఈ నాగరిక లోకంమీద ద్వేషంతో పగతీర్చుకునే ఉద్దేశంతో పెరిగాను. కానీ అది నా ఒక్కడివల్లనూ జరిగే పనికాదని అనుభవం వలన గ్రహించి అతికష్టంమీద యెక్కడెక్కడో వున్న మావాళ్ళనందరినీ ఏకం చేసాను.

అందరం కలసి ఈ దీవి పైన మా పూర్వ నివాసాలను పునరుద్ధరించాం. పెద్ద చెక్కపడవ నొకదానిని సంపాదించి దారినపోయే నౌకలను దోచుకోసాగాం. కానీ ఎన్నాళ్ళిలా? సముద్రపు జీవితం చాలా చికాకులతో కూడినది. అనుక్షణం ప్రమాదకరమయింది. అందుకే ఈ జీవితాలకు స్వస్తిపలికి మేమందరం నాగరిక ప్రపంచంలో అడుగు పెట్టాలని నిశ్చయించుకున్నాం. అయితే అక్కడా మా పని దోచుకోవడమే! ఆ రకంగా మా చిరకాల వాంఛ.... అదే నాగరికులమీద పగతీర్చుకోవడంకూడా నెరవేరినట్టవుతుంది. జీవితంలో వెరైటీ సయితం వుంటుంది.

నాగరిక ప్రపంచంలో ఇంతమందితో కలసి మేం

నిలదొక్కుకోవాలంటే మాకు మొదట డబ్బు పెట్టుబడి బాగా వుండాలికదా? అందుకే సమయంకోసం ఎదురు చూస్తూ వున్నాం.

ఈ యుద్ధనౌక ఆ మధ్య నెలరోజులుగా సముద్రంలో తిరుగుతూ ఇంచుమించు ప్రతిరోజూ మాకు యెక్కడో ఒకచోట యెదురవుతూ వుండేది. మేం సముద్రంలో తిరిగేటపుడు ఏ నౌకమీదన్నా దాడిచేసేటప్పుడు తప్ప మిగిలిన సమయాల్లో చేపలు వేటాడే పడవల్లో జాలరుల్లా గుంటాం. అందుకే మమ్మల్ని గుర్తించలేదెవరూ.

ఇదిలా వుండగా మాకో వార్త తెలిసింది. ఒక పాసింజర్ నౌకద్వారా కెనడా ప్రభుత్వానికి చెందిన సుమారు వందకోట్లు విలువచేసే బంగారం రవాణా కాబోతుందన్నదే ఆ వార్త సారాంశం. ఆ బంగారాన్ని యేదోలా స్వాధీనం చేసుకోగలిగితే చాలు మా జీవితాశయం నెరవేరే దారి దొరుకుతుంది.

బంగారం రహస్యంగా రవాణా అవుతోంది గనక పెద్దగా సెక్యూరిటీ వుండే అవసరం గురించి ఆలోచించరెవరూ. మహా వుంటే పది పదిహేనుమంది అదీ యే సివిల్ డ్రెస్‌లోనో కాపలా వుంటారు. ప్రయాణీకుల నౌక గనక జనం ఎక్కువగా వుంటారు. వారినీ ఏదోలా మేనేజ్ చేసుకోవచ్చుననుకుంటే నౌకను ఆపడం ఎలా? అన్నదే సమస్య!

భారీ నౌక గనక, మా చెక్కబోటు ఒక విధంగా బలమయిందే అయినా దానిముందు నిలవలేదు. ఆ పరిస్థితిలో మాకు జ్ఞాపకం వచ్చిందీ యుద్ధనౌక. దీనిని గనక స్వాధీనం చేసుకోగలిగితే చాలా ప్రయోజనాలు చేకూరుతాయి. అందుకే బాగా ఆలోచించి ఓ పథకం

వేసి బయల్దేరాం. రెండ్రోజుల్లోనే యెదురయింది మాకిది.

అప్పటికి సాయంత్రమయి కొద్దిగా వెలుగు మిగిలి వుంది. మేం మా నౌకను ఆపి, సహాయపడవలసిందిగా జెండాలు ఎగరేసాం. మేము ఏదో ఆపదలో వుండి సహాయం కోరుతున్నామనుకున్నారు యుద్ధ నౌకలో సిబ్బంది. మా వాళ్ళు పైన పదిమందే వున్నారు. మిగిలిన వాళ్ళంతా సుమారు నూటనలభై మంది లోపల రహస్య గదుల్లో దాక్కున్నారు. యుద్ధ నౌక మా ప్రక్కనే వచ్చి ఆగింది. అందరం జాలర్ల వేషాల్లో వున్నాం. మచ్చుకి కొన్ని చేపలు కూడా డెక్ మీద పడివున్నాయి.

'ఏమయింది?' అన్నాడు యుద్ధనౌక కేప్టన్.

'ఇంజిన్ చెడిపోయింది. ఏదన్నా తీరం చేర్చి పుణ్యం కట్టుకోమని' దీనంగా అడిగాం! యుద్ధనౌకలోనుండి పది మంది సాయుధులయిన సైనికులు మా ఓడమీదకు వచ్చి అంతా తనిఖీ చేసి వెళ్ళారు. రహస్య గదులు చాలా పకడ్బందీగా వుంటాయి. మరో పదిమంది తనిఖీ చేసినా బయటపడవవి.

మా ఓడ యుద్ధ నౌకకు జోడింపబడింది. రెండూ కలిసి బయల్దేరాయి. అర్ధరాత్రి గడిచాక యుద్ధనౌకలో అంతటా సద్దుమణిగింది. డెక్ మీద ఇద్దరు ముగ్గురు కాపలా సైనికులు మాత్రం వున్నారు. వాళ్ళను గుట్టుచప్పుడు కాకుండా కత్తులతో పొడిచి సముద్రంలో తోసేశాం. మా వాళ్ళు ఒకరొకరే వెళ్ళి నౌకలో కీలక ప్రదేశాలు చేరి నా ఆజ్ఞలకోసం ఎదురుచూస్తున్నారు.

మొట్టమొదటగా కంట్రోల్ రూమ్, కమ్యూనికేషన్స్ పానల్ రెండుచోట్లా ఒకేసారి దాడి జరిపి వాటిని మా

స్వాధీనంలోకి తెచ్చుకున్నాం. వాటి సిబ్బందిని అక్కడి కక్కడే పొడిచి చంపేసాం. అప్పుడు మా వాళ్ళంతా యుద్ధనౌకలోని విశ్రాంతి గదుల్లో వున్న సైనికులమీద దాడిజరిపి ఒక్కడుకూడా మిగలకుండా తుపాకులతో కాల్చి చంపారు. మేం ఇంత పకడ్బందీగా పోరాటం జరిపినా మా వాళ్ళు ఓ ఇరవై మంది చనిపోయారు. ఏమయితేనేం యుద్ధనౌక మా స్వాధీనంలోకి వచ్చింది.

వెంటనే యుద్ధనౌకను సంబంధించి, నేవీ హెడ్ క్వార్టర్స్‌కు; ఏదో ప్రమాదం హఠాత్తుగా సంభవించి హెర్క్యులిస్ సముద్రంలో మునిగిపోతున్నట్టు లాస్టు మెసేజ్ పంపాం.

నౌకల్ని నడపడంలో ఆకలుతీరిన సమరులు మాలో ఓ ఆరుగురున్నారు. వారి ఆధ్వర్యంలో హెర్క్యులిస్ ఇదిగో ఇక్కడికి చేర్చబడింది. ఇంతకూ దురదృష్టమేమి టంటే ఆ ఆరుగురూ నాలుగురోజుల క్రిందట ఓ బాంబు ప్రమాదంలో మా కళ్ళముందే చచ్చారు. వారితోబాటు మరికొంత మంది చనిపోయారనుకోండి. అది అంత చెప్పు కోదగ్గ కష్టమేం కాదు.

ఎటొచ్చీ బంగారంతో కెనడా నౌక మరో ఐదు రోజుల్లో రాబోతుంది. ఈ సమయంలో హెర్కులిస్‌ని నడిపే సమరులు మాకు లేరు. ఇదే చికాకులో మేం సత మతపడుతున్నంతలో మీరు మాకు దొరికారు. మీ ఆధ్వ ర్యంలో హెర్క్యులిస్ ఈవాళ్టితో ఐదవ రోజున బయ లేరుతుంది.

హెర్క్యులిస్ అమెరికన్ యుద్ధ నౌక. అది ప్రమాద వశాత్తూ మునిగిపోయిందని భావిస్తోంది అమెరికన్ నేవీ. అయితే ఆ విషయమేదీ లోకానికి తెలియదు. మనం అదే

నౌకలో వెళ్ళి పాసింజర్ నౌకను అడ్డగిస్తాం. మన వాళ్ళంతా అమెరికన్ నేవీ దుస్తులు ధరించి వుంటారు. పాసింజర్ నౌక సులువుగా మన స్వాధీనంలోకి వస్తుంది. బంగారాన్ని దోచుకొని నౌకని వదిలేస్తాం. దీవిచేరాక మందు పాతర పెట్టి హ్యార్క్యులిస్‌ని సముద్రంలో ముంచేస్తాం.

అమెరికా కెనడాలు ఆ తర్వాత తన్నుకుంటాయో తలలే పట్టుకుంటాయో! ఏం జరిగినా నాకు ఆనందమే. బంగారంలో కొంత వాటా మీకిస్తాను. అంతా అయ్యాక మీకు ఇష్టముంటే మాతో కలిసి రావచ్చు. కాదంటే మీకు నచ్చినచోట మిమ్మల్ని వదలి మా దారిన మేం పోతాం!" అన్నాడు రూసో.

"ఈ పని మాకిష్టం లేదంటే!" అనకూడదనుకుంటూనే అన్నాడు రాజు.

రాజు మొహంలోకి ఆశ్చర్యంగా చూసి పెద్దగా నవ్వాడు రూసో "వెల్ మిష్టర్ రాజు! ఒక వేళ అదే మీ నిశ్చితాభిప్రాయమయితే మిమ్మల్ని చూసి జాలిపడక తప్పదు. ఇంతక్రితం మీ కళ్ళముందే ఒక స్త్రీ దారుణ మయిన బాధకు గురయింది. పాట్లేలు సంగతి చెప్ప డానికే లేదు. వాస్తవానికి చెప్పాలంటే అవి లేలిక పాటి బాధలు. మీరు చూడలేదు గనక తెలియక అలా మాటాడారు తప్ప అదేచోట మరింత దారుణమయిన పరిస్థితులున్నాయి" అన్నాడు రూసో గంభీరంగా.

రాజు ఆ మాటలకు ఏ సమాధానము చెప్పలేదు.

రూసో అతని మౌనాన్ని గమనించి చిన్నగా నవ్వుతూ "నాకు తెలుసు. మనుషులెవరూ తెలిసి అటువంటి బాధల్ని ఆహ్వానించలేరు. అయినా ఒకమాట. కొందర

పడి ఏదో ఒకటి చెప్పాలనేం లేదు. ఈ రోజంతా మీ మిత్రులతో బాగా ఆలోచించి చెప్పండి" అన్నాడు.

8

మరుసటి రోజు ఉదయమే రూసో మనుషులు వచ్చి రాజు బృందాన్ని రూసో వద్దకు తీసుకుపోయారు. రూసో విశాలమయిన ఓ టేబిల్ ముందు కూర్చొని వున్నాడు. టేబిలుమీద అనేక రకాలయిన తీపి పదార్థాలు, పండ్లు, పాలు, రొట్టెలు వున్నాయి.

రూసో రాజుని ఉద్దేశించి గంభీరంగా "ఏమిటి మీ నిర్ణయం" అన్నాడు గంభీరంగా.

"నౌకను మేం నడిపిస్తాం. కానీ అక్కడ ఏ వ్యక్తినీ మీరు హింసించకూడదు" అన్నాడు రాజు.

రూసో అంగీకారంగా తల ఊపుతూ "ప్రతిఘటన లేనంతవరకూ మీ షరతుకు మేం లోబడి వుంటాం" అన్నాడు నమ్మకంగా. రాజు అంగీకారంగా తల ఊపాడు.

రూసో ఆ తర్వాత వారిని తనతోబాటు తినేందుకు ఆహ్వానించాడు. విందు సరదాగా గడిచింది. అంతా అయ్యాక రూసో వారితో "రేపే మన ప్రయాణం. సిద్ధంగా వుండండి" అన్నాడు.

రాజు బృందం భారంగా కదిలారు అక్కణ్ణుండి.

తప్పని పరిస్థితుల్లో వారు రూసోకి సహాయపడేందుకు అంగీకరించారు. ఈలోగా ఎప్పుడు అవకాశం చిక్కినా రూసోని దెబ్బతీయాలన్నదే వారి ఆలోచన. అప్పటివరకూ ఎటువంటి పరిస్థితుల్లోనయినా ఆ విషయం రహస్యంగా వుంచాలని అంతా కలసి నిర్ణయం తీసుకున్నారు. కానీ

రూసో మరీ అమాయకుడేం కాదు. అతడి అనుచరులు అహర్నిశలూ వారిని వెన్నంటే వుంటున్నారు.

రాజు సారథ్యంలో మరుసటి రోజు సూర్యోదయానికి పూర్వమే బయలేరింది యుద్ధనౌక హెర్క్యులిస్. రూసో చెప్పినట్టు అక్కడ సముద్ర ప్రాంతం నౌక వేసే ప్రతి అడుగూ పరీక్షించేదే. నిత్యం బ్రహ్మాండమయిన అలలతో ఆటుపోటుల మధ్య తొణికిసలాడే నీటిలో యే ప్రక్క సూదికొండలు కాచుకకూర్చున్నవో గమనించడం కష్టం.

అనుభవజ్ఞులయిన రూసో అనుచరుల సూచనల మేరకు రాజు నౌకను చాకచక్యంగా ముందుకు నడిపిస్తున్నాడు. నౌకాయానంలో రాజు బుర్ర కంప్యూటర్ వంటిది. కీలకమయిన, అపాయకరమయిన ఆ ప్రాంతంలో నౌక తిరిగే మలుపులన్నీ ఎప్పటికప్పుడు ఆ బుర్రలో ముద్రింపబడుతున్నాయి. చెప్పాలంటే కారు చీకటిలో సయితం రాజు తానిప్పుడు దాటివచ్చిన దారిలో నౌకను తిరిగి తీసుకుపోగలడు.

మూడు రోజులు సముద్రంలో చక్కర్లు కొడుతూ కెనడా పాసింజర్ నౌకకోసం ఎదురుచూస్తూ వున్నారంతా. ఎట్టకేలకు తన గమ్యంలో పయనిస్తున్న ఆ నౌకను గుర్తించగలిగింది హెర్క్యులిస్. లొంగిపోవలసిందిగా యుద్ధనౌకలోనుండి రూసో చేసిన హెచ్చరికను లక్ష్యపెట్టకుండా ముందుకు పోతోంది పాసింజర్ నౌక "కరోలినా"

యుద్ధనౌకమీద ఫిరంగులు సింహగర్జన చేసాయి. కరోలినా నిలబడిపోతూ తెల్ల జెండా ఎగురవేసింది. హెర్క్యులిస్ నెమ్మదిగా కరోలినా సరసన చేరి ఆగింది. అమెరికన్ నేవీ సైనికుల వేషాల్లో వున్న రూసో అను

చరులు కరోలినాలో వున్న ప్రయాణీకులందరినీ ఒక చోట చేర్చారు.

ఒక అమెరికన్ యుద్ధనౌక సిబ్బంది సముద్రపు దొంగల్ని మించి జరుపుతున్న చర్యల్ని ప్రయాణీకులంతా విస్తుపోయి చూస్తున్నారు. కరోలినా కెప్టెన్ పరుగెత్తుకొచ్చి డెక్ మీద ఆజ్ఞలు జారీచేస్తున్న రూసో మీద విరుచుకుపడ్డాడు.

"స్టుపిడ్స్! మీరేం చేస్తున్నారో మీకు తెలియడం లేదు. త్వరలో దీనికి మీ ప్రభుత్వం సంజాయిషీ ఇచ్చుకోవాల్సి వుంటుంది. నేను మా హెడ్ క్వార్టర్సుకి ఈ విషయమై మెసేజ్ పంపిస్తున్నాను.... ఇంత దౌర్జన్యమా...." చడామడా వాగేస్తున్నాడు కరోలినా కెప్టెన్.

రూసో సమాధానంగా అతడి దవడమీద లాగిపెట్టి ఒకటిచ్చాడు. అంతే కళ్ళు బైర్లుకమ్మి చెవులు రెండూ మూసుకున్నాడు కెప్టెన్.

నౌకలో కాల్పులు చెలరేగాయి. బంగారానికి కాపలా వున్న సెక్యూరిటీగార్డులు లొంగిపోయేందుకు ఇష్టపడలేదు. ఆ పదిమంది గార్డులూ ఓ గంటసేపు నిర్విరామంగా పోరాడి రూసో అనుచరుల్ని సుమారు పాతిక మందిని నేల కూల్చారు. ఎట్టకేలకు రూసో అనుచరులు వారిని చుట్టుముట్టి దారుణంగా చంపేసారు.

ఆ వూపున రూసో అనుచరుల పాశవిక మనస్తత్వం విజృంభించింది. అదీగాక చెక్క పెట్టెల్లో దాచి పెట్టబడిన బంగారం చూసి మరింత పేట్రేగిపోయారు వాళ్ళు.

అందమయిన ఆడవాళ్ళను సిగ్గూ బిడియమనే మాటే లేకుండా ఎక్కడి కక్కడ ప్రయాణీకు లందరి యెదుటా

క్రూరంగా మానభంగాలకు పాల్పడ్డారు. ఆవేశం పట్టలేక ముందుకు వచ్చిన పురుషులందరూ రూసో అనుచరుల తుపాకీ గుళ్ళకు బలయ్యారు. అంత్యదశలో వారూ వీరూ అనే భేదం లేకుండా అందరినీ చంపేసారు.

కళ్ళముందే ప్రారంభమయిన సముద్రపుదొంగల దురాగతాలను చూసి సహించలేక పోయారు రాజా బృందంలోని మిగిలిన నలుగురూ.

"దుర్మార్గులు! మాట తప్పారు. ఆ రూసోగాడి తల చితగ్గొట్టాలి. పదండి వెళదాం" అన్నాడు బల్వంత్ పిడికిళ్ళు బిగిస్తూ ఆవేశంగా.

"అంతే! అదే చేద్దాం! మనం చచ్చినా సరే" అన్నారు మిగిలిన ప్రకాష్, రవి, సునీల్.

రాజా తల అడ్డంగా వూపాడు. "ఫ్రెండ్స్! మనం యుద్ధనౌకను నడిపించి పెద్ద తప్పే చేసాం. రూసోని చంపడం లేదా మనం చావడం సమస్యకు పరిష్కారం కాదు. ఈ మారణకాండను ఇక ఆపడం కూడా మన తరంకాదు. ఆవేశం వదలి ఆలోచించండి. లోకానికి ఈ సముద్ర పిశాచాల గొడవ శాశ్వతంగా వదలిపోవాలి. ఆ కార్యక్రమంలో మన ప్రాణాలు పోయినా ఫరవాలేదు. కానీ ప్రస్తుతానికి శాంతించండి. సమయం దొరికేవరకూ వేచివుండండి" అన్నాడు.

రాజా మాటలు వాళ్ళందరిమీదా పనిచేశాయి బాగా. ప్రయాణీకుల హాహాకారాలు వినలేక వాళ్ళంతా హెర్క్యులిస్ అంతర్భాగంలో వున్న మారుమూల గదిలోకి పోయి తలుపులు వేసుకున్నారు.

రూసో అనుచరులు పాసింజర్ నౌకకు నిప్పుపెట్టి యుద్ధనౌకమీదకు వచ్చేసారు. చూస్తుండగానే అది

మంటల్లోమాడి పేలి సముద్రంలో కలిసిపోయింది. బంగారంతో యుద్ధనౌక సముద్రపు దొంగల దీవికి తిరుగుముఖం పట్టింది.

రూసో అతడి అనుచరులు గొప్ప హుషారుమీద వున్నారు. రాజు బృందాన్నికూడా తమతోబాటు తాగి మజా చేసేందుకు రమ్మని వాళ్ళంతా బలవంతం చేసారు. తమకు తాగుడు అలవాటులేదని చెప్పి వాళ్ళను వదిలించుకునేసరికి బ్రహ్మప్రళయ మయింది వారికి. హెర్క్యులిస్ నిమ్మదిగా తమ స్థావరాన్ని చేరింది.

బంగారం హెర్క్యులిస్ లోనే వుంచబడింది. ప్రయాణం ఎటూ రెండుమూడు రోజుల్లోనే గనక దానిని అటునుండి ఇటు పదేపదే మార్చడందేనికని రాజు సలహా యిచ్చినమీదట "అదీ నిజమే" అన్నాడు రూసో.

9

రాజుబృందం మొదట వుంచబడిన బసలోనే ఇప్పుడూ వున్నారు. బయట తలుపులకు తాళం వేయలేదు గాని, ఎప్పటిలా నలుగురు సాయుధులు మాత్రం కాపలా వున్నారు.

"అంటే రూసో తమను ఇంకా పూర్తిగా నమ్మలేదన్న మాట!" అనుకున్నారు వాళ్ళు. ఏమయితేనేం మునుపటి కన్నా ఇప్పుడు కొంచెం నయం. ఇంటి పరిసరాల్లో ఆ మాత్రంగానయినా తిరిగే అవకాశం వుంది.

రాత్రి ఒంటిగంట కావస్తోంది. అంతటా నిశ్శబ్దం ఆవహించింది. రూసో అతడి అనుచరులు ఇంచుమించు ఆ సమయంవరకూ ఇష్టం వచ్చినట్లు తాగి తందనాలాడి అలసి ఎవరి నివాసాలకు వారు పోయారు. కాపలా డ్యూటీల్లో వున్నవాళ్ళు ముంచుకువచ్చే నిద్రాదేవిని దరిచేరనీయ

వరండా అవసలు పడుతూ అటూ ఇటూ తిరుగుతున్నారు.

"మనం తప్పించుకుపోయేందుకు సరయిన సమయం. అంతా నిదమే కదూ!" అడిగాడు రాజు.

మిగిలిన నలుగురూ మౌనంగా తలలూపారు. రాజు చప్పుడు కాకుండా గోడలకున్న బలమయిన మేకుల్ని వూడదీసాడు. ఒక్కొక్కటీ ఏడెనిమిదంగుళాల పొడవు వుంది.

ప్రస్తుతానికి ఇవే మన ఆయుధాలంటూ రాజు ఆ మేకుల్ని తలొకటీ పంచాడు. బల్వంత్ నవ్వుతూ మేకుని అటూ ఇటూ తిప్పి చూశాడు.

"భలే ఆలోచన రాజూ. నేనింకా ఆయుధాల మాటేమిటా అని ఆలోచిస్తున్నాను" అన్నాడు బల్వంత్.

గదిలోపల ఒకే ఒక కొవ్వొత్తి గుడ్డిగా వెలుగుతున్నది. దానిని ఆర్పేయబోయాడు ప్రకాష్.

"వద్దు! అదలాగే వుంచండి. గది లోపల చీకటయితే కాపలావాళ్ళకు అనుమానం కలగవచ్చు" అన్నాడు రాజు.

తలుపు ఓరగా తీసి చూసాడు రాజు. వరండా అంతా చీకటి. అక్కడ ఇద్దరు కాపలా వున్నారు. ఒకడు పిట్ట గోడమీద కూర్చొని స్తంభానికి ఆని ముడుకులమీద తల వుంచి కునికిపాట్లు పడుతున్నాడు. రెండోవ్యక్తి చేతులు వెనక్కి కట్టుకొని కాళ్ళు ముందుకు విసురుతూ అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు.

తలుపు కొద్దిగా చప్పుడు చేస్తూ తెరిచాడు రాజు. కాపలావాడు గిరుక్కున వెనుదిరిగి రాజుని చూస్తూ "ఏం కావాలి" అన్నట్టు తలెగరేశాడు.

"మంచి నీళ్ళయిపోయాయి తెచ్చి పెడతావా?" మొహాన నవ్వు పులుముతూ అడిగాడు రాజు. కాపలా వాడికి అనుమానం రాలేదు. చంకన వున్న తుపాకీని గోడకు జారేసి తలుపు దగ్గరకు వచ్చాడు. రెండో వాడు ఈ లోకంలో లేడు.

"ఆ కూజా ఇటివ్వండి" ప్రక్కకు తిరిగి సగం మనిషి బయట సగం మనిషి లోపలా వున్నాడు కాపలా వాడు. వాడు పూర్తిగా లోనికొస్తేనే గాని పని జరగదు. బల్వంత్, ప్రకాష్‌లు తలుపు రెక్కల వెనక నక్కి వున్నారు.

కూజాకోసమని వెనక్కి తిరిగినట్టు తిరిగి ఓ అడుగు ముందుకు వేస్తూ నేర్పుగా జారిపడ్డాడు రాజు. "అరె!" అంటూ లోనికి వచ్చి రాజుని పైకి లేపేందుకు ముందుకు వంగాడతను. బల్వంత్, ప్రకాష్‌లు అదే అదనుగా వాడి మీద విరుచుకుపడ్డారు.

బల్వంత్ ఒక చేత్తో వాణ్ణి ఒడిసిపట్టి రెండో చేత్తో నోరు గట్టిగా మూసి వుంచాడు. ప్రకాష్ చేతిలో వున్న మేకుతో అతణ్ణి పక్కల్లో పొడిచాడు పలుమార్లు. కాపలా వాడు కిక్కురుమనకుండా చచ్చాడు.

రాజు తలుపు దగ్గరకు వచ్చి తొంగి చూసాడు బయటికి. రెండవ వ్యక్తికి కిదేం తెలియదు పాపం! కునికి పాట్లు పడుతూ చిన్నగా గురకతీస్తున్నాడు. బల్వంత్ చప్పుడు చేయకుండా వెళ్ళి కుడిచేయి పిడికిలి బిగించి శక్తికొద్దీ వాడి నెత్తిమీద గుద్దాడు. ఉన్న బరువు ఒక్కేసారి మెడమీద పడినట్టు చాపచుట్టలా ప్రక్కకు ఒరిగిపోతున్న వాణ్ణి రెండు చేతులా పొదివిపట్టి గదిలోకి ఈడ్చుకొచ్చేసాడు బల్వంత్.

రాజా కాపలా వాడి ముక్కు దగ్గర వేలు పెట్టి చూశాడు. బల్వంత్ నవ్వుతూ "మెడలు విరిగినవా డెవ్వడూ బ్రతకడు భాయ్!" అన్నాడు.

రాజు తల వూపుతూ "చచ్చాడు" అన్నాడు. రెండు తుపాకులు తూటాల పట్టీలు వారి వశమయ్యాయి. అయినా వాటిని వాడేందుకు వీలుకాదిప్పుడు. పని జరగాలంటే చాపకింద నీరులా జారిపోవాలే తప్ప చీమ చిటుక్కు మనేంత చప్పుడు సయితం కూడదీ సమయంలో. వెనక భాగంలో మరో ఇద్దరున్నారు. రాజా బృందం ముందుకు సాగాలంటే మెట్లదారి అదే వుంది!

కిటికీ చప్పుడు చేయకుండా గాలివాటున తెరచుకున్నట్టు తెరిచాడు రాజా. మెట్లకిరుప్రక్కలా వున్న దిమ్మమీద అటు తిరిగి మాటాడుతూ కూర్చున్నారిద్దరూ. తుపాకులు ఆ దిమ్మలకే జారవేసి వున్నాయి.

రవి, సునీల్‌ను పిలిచాడు రాజా. ఇద్దరినీ దగ్గరకు చేర్చి వారి చెవుల్లో నెమ్మదిగా చెప్పాడు ఏం చెయ్యాలో. రవి సునీల్ గది బయటకొచ్చి చెరోప్రక్క విడిపోయారు. కిటికీలోనుండి చేయిచాచి వుంచాడు రాజు. రవి, సునీల్ పూలకుండీల దాపుగా నేలమీదపాకుతూ వెళుతున్నారు. వారికి కాపలావాళ్ళు కనపడరు. కాపలావాళ్ళకు వీరిద్దరూ కనపడరు. రాజు కాపలావాళ్ళను గమనిస్తూ చేయి వూపుతున్నాడు. రవి, సునీల్ ఆ చేతిని గమనిస్తూ ముందుకు పోతున్నారు.

బాతాఖానీ మంచి రసపట్టులో వున్నట్టుంది. కాపలా వాళ్ళు వెనక్కి తిరిగి చూడనే లేదసలు. గరుకు నేల. మోకాళ్ళూ చేతులు పీక్కుపోతున్నాయి. బాధను భరిస్తూ కిక్కురుమనకుండా పాముల్లా పాకుతున్నారు రవి,

సునీల్.

కాపలావాళ్ళకు బాగా చేరువలో కొచ్చారిద్దరూ. వీపులు స్పష్టంగా గోచరిస్తున్నా యిప్పుడు. రవి, సునీల్ సైగ చేసుకొని ఒకేసారి లేచి వాళ్ళమీదపడ్డారు. ఎడమ చేతులతో వాగుతున్న నోళ్ళకు తాళం వేసి కుడిచేతిలో వున్న మేకులకు పని కల్పించారు. కాపలావాళ్ళు వారిద్దరి చేతుల్లోనూ తోటకూర కాడల్లా వేలాడిపోయారు. రాజు బృందం ముందుకు సాగేందుకు మార్గం సుగమమయింది.

రాజుతప్ప మిగిలిన నలుగురూ తూటాల బెల్టులు ధరించి తుపాకులు చేతబట్టారు. సముద్రపు దొంగలు అనుక్షణం ధరించే వేటకత్తులు, పెద్దదయిన టోపీలు ధరించారు వారు. అయినా సాధ్యమయినంతవరకూ చెట్లు పొదలు ఆసరాగా ముందుకు కదులుతున్నారంతా.

ఒకచోట భూగృహం లాంటిది వుంది. దానిముందు సాయుధులయిన వ్యక్తులిద్దరు పహారాకాస్తున్నారు.

"ఆ గృహం ఏమయ్యుంటుంది?" ప్రశ్నించాడు రాజు నెమ్మదిగా. బల్వంత్ రాయ్ వున్నాడతని వెనక. పొదల మాటున నక్కి వున్నారందరూ.

"బహుశా అమ్యునిషన్ స్టోర్ అయ్యుంటుంది" గొణిగాడు బల్వంత్.

"అదే నిజమయితే దానితో మనకి చాలా పనివుంది" అన్నాడు రాజు.

"అయితే ఓ పట్టుపడదామంటావా?" అడిగాడు బల్వంత్ హుషారుగా. తల వూపాడు రాజు.

బల్వంత్ రవి సునీల్‌ను తనవెంట రమ్మన్నాడు. రాజు, ప్రకాష్‌లు అవసరమయితే రంగంలోకి దిగేందుకు దాపులనే వున్నారు సిద్ధంగా.

టోపీలను వీలయినంత మేర మొహాలమీదకు లాక్కున్నారు ముగ్గురూ. బల్వంత్ ఠీవిగా ముందుకు నడుస్తున్నాడు. కాపలా మనుషులు వారిని చూస్తూనే సర్దుకున్నారు. సాధారణంగా అక్కడ సంచరించేది వారి మనుషులేగనక మరీ అంత పట్టుదలగా వుండరెవరూ.

"ఎవరది?" ప్రశ్నించారు కాపలా మనుషులు. అప్పటికి వారి చేతుల్లో తుపాకులు నేలకు ఆనించే వున్నాయి.

"మెసేజ్ ఫ్రమ్ కమాండర్!" బొంగురు స్వరంతో పలికాడు బల్వంత్. రూసోని అక్కడంతా కమాండరనే పిలుస్తారు.

కాపలావాళ్ళు రిలాక్సవుతూ "ఎంతమందిని వదలాలేంటి" అన్నారు నవ్వుతూ. ఆ మాటతో అది అమ్యూనిషన్ స్టోర్ కాదని తెలిసిపోయింది వారికి. ఏదయితే నేం ముగ్గులోకి దిగాక వెనక్కి తగ్గే ప్రశ్న లేదు. అసలికి ముగ్గురూ కాపలావాళ్ళకు బాగా చేరువయ్యారు.

కాపలావాళ్ళలో ఒకడు చేయి చాచి "ఆర్డర్" అని అడిగాడు. బల్వంత్ "ఆర్డరు" అంటూ జేబుల్లోకి చేతులు పోనిచ్చి మరో రెండడుగులు వేసి వారి మధ్యకు చేరాడు. చేతులు రెండు చటుక్కున పైకిలాగి ఇద్దరి కంఠాలూ ఒకేసారి పట్టుకున్నాడు గట్టిగా. కాపలా వ్యక్తులు గిజగిజలాడుతూ తప్పించుకునే ప్రయత్నం చేసారు. కానీ అది భల్లూకపు పట్టు. ఊపిరి అందక వారిద్దరూ కొట్టుమిట్టాడుతున్న తరుణంలో రవి, సునీల్ తమ వంతు కర్తవ్యాన్ని పూర్తి చెయ్యగా సముద్రపు దొంగల శవాలు తుప్పల్లోకి విసిరివేయబడ్డాయి.

రాజు, ప్రకాష్ ఈలోగా చేరారక్కడికి. భూగృహం తలుపులకు పెద్ద తాళంకప్ప వేలాడుతోంది.

"దీనిని పగలగొట్టడం ఎలా? తుపాకీ పేలిస్తే చప్పుడవుతోంది మరి" బుర్ర గోక్కుంటూ అన్నాడు బల్వంత్ రాయ్.

రాజు నవ్వుతూ "శవాల జేబుల్లో తాళాలుంటాయి" అన్నాడు.

"అవునుసుమా! ఆ మాటే మరిచాను" అంటూ తిరిగి పొదల్లోకి పరుగెత్తాడు బల్వంత్ తాళాలకోసం. కాపలా వాడి శవం జేబుల్లో తాళాలు దొరికాయి.

తలుపులు తెరవబడ్డాయి. లోపల మిణుకు మిణుకు మంటూ ఓ దీపం వెలుగుతోంది. అక్కడక్కడా శవాలకు మల్లే పడివున్నారు మనుషులు. ఆడా మగా కలిసి సుమారు ఓ ముప్పైమంది వుంటారు.

తలుపులు తెరచిన శబ్దానికి ఉలిక్కిపడుతూ లేచారు కొందరు. ఏ ఒక్కరి కళ్ళల్లోనూ జీవంలేదు. ఆగంతకుల వంక భయంగా చూడసాగారు. తమలో ఏ ఒక్కరికయినా చావుమూడితేనో లేదా మానసో ఆనందంకోసం తమను హింసించేందుకో తలుపులు తెరవబడతాయి. మిగిలిన సమయాల్లో తిండికూడా తలుపు కన్నాల్లోంచి విసరబడుతుంది. ఎవరికివారు ఆ రొట్టె ముక్కలకోసం కుక్కల్లా కొట్లాడుకుంటుంటే బయటనుండి సముద్రపు దొంగలు ఆ దృశ్యాల్ని సినిమా తిలకిస్తున్నట్టు తిలకిస్తూ ఆనందిస్తారు.

రాజు అక్కడి పరిస్థితిని తిలకిస్తూనే వారంతా సముద్రపు దొంగల చేతుల్లో బాధలను అనుభవిస్తున్న బందీలుగా గ్రహించాడు. వారిలో పురుగులమధ్య హింసింపబడిన స్త్రీకూడా వుంది.

తమ అంచనా తప్పయి అది అమ్మ్యునిషన్ స్టోర్

కానందుకు రాజు ఏమాత్రం బాధపడలేదు. అంతకుమించి వేయి రెట్లు శక్తిగల మనుషుల సహకారం తమకిప్పుడు తోడవుతోంది. సముద్రపు దొంగల చేతుల్లో దారుణంగా హింసలకు గురవుతున్న వీళ్ళు ఒక్కొక్కరు అవకాశంవస్తే వందమందితో నిర్భయంగా పోరాడగలరు. అంతటి కసీ, ద్వేషం ఆ కళ్ళలో స్పష్టంగా గోచరిస్తున్నాయి.

రాజు వారందరికీ తానెవరనో చెప్పాడు. తమను విడిపించేందుకు వచ్చిన ఆ అయిదుగురు వ్యక్తుల్నీ నమ్మలేనట్లు చూశారు వాళ్ళు.

పురుషుల మధ్య బాధింపబడిన స్త్రీ గట్టిగా అరుస్తూ "వీళ్ళను నేను కొద్దిరోజుల క్రితం రూసో వెంట చూసాను. అవకాశం వుంటే అప్పుడే వీళ్లు ఆ దొంగ వెధవల్ని మట్టుపెట్టేంత ఆవేశాన్ని కనబరచడం గమనించాన్నేను. సందేహంలేదు. వీళ్ళు మన మిత్రులు" అందామె.

ఆ మాటతో ఖైదీలు ఆనందం పట్టలేక అరుస్తూ గంతులు వేయగా కొందరు పెద్దగా యేడ్చేసారు. వారందరినీ ప్రశాంతంగా వుంచేందుకు రాజు బృందం కొంత శ్రమపడాల్సి వచ్చింది. ఖైదీలందరూ దాదాపు బలహీనంగా వున్నారు. అయినా భవిష్యత్తుమీద చిగురించిన ఆశలు వారిలో కొత్త శక్తిని ప్రవేశపెట్టాయి.

వారంతా కలిసి అక్కడికక్కడ ముందు జరగబోయే కార్యక్రమాన్ని రూపొందించుకున్నారు. ఖైదీలలో ఇద్దరు మాజీ సైనికాధికార్లు వున్నారు. వారిద్దరూ ఇకమీదట సముద్రపు దొంగల్ని యెదుర్కొనే విషయంలో రాజు బృందానికి సహకారం ఇచ్చేందుకు ముందు నిలుస్తామన్నారు. మిగిలిన వాళ్ళంతా యెప్పటికప్పుడు వారి ఆజ్ఞల ప్రకారం నడుచుకుంటారు.

"అంతా బాగానే వుంది! ఇంతమందికి ఆయుధా లేవీ?" వున్న ఐదారు తుపాకులు వందల సంఖ్యలో వుండే సముద్రపు దొంగలకు ఏమాత్రం దీటురావు.

"ఆయుధాల గిడ్డంగి ఎక్కడుందో తెలుసుకోవడం తప్పనిసరి పని" అన్నాడు రాజు.

"అదెక్కడో నాకు తెలుసు" అన్నాడొక ఖైదీ ముందుకి వస్తూ.

రాజు మొహం వికసించింది. "ఏమాత్రం దూరమది? ఓ అరగంటలో చేరుకోగలమా?" అన్నాడు ఆత్రతగా. ఎందుకంటే తూర్పున తెల్లవారేందుకిక గంటకుమించి లేదు సమయం.

ఖైదీ "అరగంట దేనికి. ఇటుప్రక్కనే వుంది. తొందరగా నడిస్తే ఐదు నిమిషాలు" అన్నాడు.

"మరయితే ఆలస్యం దేనికి? పదండి" అంటూ కదిలారంతా.

10

"అదే ఈ దీవిలో రూసో అనుచరులందరికీ మందుగుండు, ఆయుధాలు సప్లయిచేసే గిడ్డంగి" అన్నాడు ఆ ఖైదీ నెమ్మదిగా.

అందరూ రాళ్ళ వెనక దాగి వున్నారు. సుమారు వంద అడుగుల దూరంలో వుందొక పెద్ద రేకుల షెడ్డు. సాయుధులైన వ్యక్తులు ముగ్గురు చుట్టూ తిరుగుతూ కాపలా కాస్తున్నారు.

"వెధవలు మరీ అలెర్టుగా వున్నట్టున్నారు!" బుర్ర గోక్కున్నాడు బల్వంత్ సందిగ్ధంగా.

"నయమే! ఇంకా పకడ్బందీగా వుంటుందేమో అనుకున్నాను" అన్నాడు రాజు.

"అది సరే! వీళ్ళను మాత్రం ఎలా తప్పించేట్టు. కనబడితే కాల్చేసేలా వుంది పరిస్థితి" అన్నాడు బల్వంత్.

రాజు ఏ జవాబూ చెప్పకుండా కొద్దిక్షణాలు ఆలోచించాడు. తమ వెంట వున్న ఖైదీలలో ఆడవాళ్ళను పరిశీలనగా చూసి ఇద్దర్ని బయటికి రమ్మన్నాడు. ఆ ఇద్దరిలో మొదట రాజు బృందాన్ని మిత్రులుగా పోల్చిన యువతి ఒకతె!

ఇద్దరూ కాస్త నీరసంగా కనబడుతున్నా చాకుల్లాంటి పిల్లలు.

"పరిస్థితి మీకు తెలుసు. ఏమాత్రం చప్పుడుచేసే అవకాశం మనకు లేదు. నా అనుమానం డ్యూటీలో వున్న ఈ ముగ్గురు కాక చుట్టు ప్రక్కల విశ్రాంతిలో మరి కొందరు వుండవచ్చు. ఈ ముగ్గుర్నీ రాళ్ళ వెనక్కి చేర్చే బాధ్యత మీది. ఆ తర్వాత పని మేం చూసుకుంటాం" అన్నాడు రాజు ఇద్దరు ఆడవాళ్ళతో.

"ఓ! అదెంతలో పని" అంటూ కదలబోయారిద్దరూ.

రాజు కంగారుగా "ఆగండాగండి. తొందరకూడదు. వాళ్ళకి మీ వెనక మనుషులున్నారనే అనుమానం రాకూడదు" అంటూ వాళ్ళకు ఏం చెయ్యాలో చెప్పి పంపాడు.

ఆడవాళ్ళిద్దరూ ఒక ప్రక్కకు పోయి అటునుండి ఆయుధాగారం ముందునుండి వడిగా పరుగెత్తసాగారు. కాపలా వాళ్ళు ఉలిక్కిపడుతూ కళ్ళనులుముకు చూశారు. ఎవరో ఇద్దరు బహుశా ఖైదీల గృహంనుండి కాబోలు తప్పించుకుపోతున్నారు.

"ఏయ్! ఆగండి!" అరిచారు కాపలావాళ్ళు.

పరుగెడుతున్న ఆకారాలు ఆగలేదు. కంగారుగా

మరింత వేగంగా ముందుకుపోతున్నారు.

"ఆగకపోతే కాల్చేస్తాం!" తుపాకులు ఎక్కుపెట్టారు కాపలావాళ్ళు. ఆకారాలు యెక్కడివక్కడ ఠక్కున నిలబడిపోయాయి.

కాపలావాళ్ళు ముగ్గురూ తుపాకులు పొజిషన్లో వుంచి వచ్చారక్కడికి.

ఖైదీలే! కానీ ఆడవాళ్ళు!! అందంగా వున్నారు. పరుగెత్తి బాగా అలసిపోయి వున్నారు. వుచ్ఛ్వాస నిశ్వాసలతో యెత్తయిన వక్షసలాలు యెగిరెగిరి పడుతున్నాయి. బాగా చిరిగివున్న దుస్తులు సగం ఒంటిని బయటికే వదిలేసాయి.

కాపలా వాళ్ళకు నరాలు జివ్వుమంటున్నాయి. గుటకలు మింగుతూనే కోపంగా "ఎక్కడికి తప్పించుకు పోతున్నారు? పదండి" అన్నారు.

ఆడవాళ్ళు గజగజలాడిపోయారు. "మీకు పుణ్యం వుంటుంది మమ్మల్ని వదిలెయ్యండి ప్లీజ్!" బ్రతిమాలారు. కావాలని కాపలా వాళ్ళ శరీరాల్ని తాకారు. ముగ్గురు మగాళ్ళూ మరింత వేడెక్కిపోయారు.

ఒకడు మిగిలిన కాపలావాళ్ళకేసి చూస్తూ కన్నుగీటి "ఆల్ రైట్! మిమ్మల్ని వదిలేస్తాం. మమ్మల్ని మజాలో ముంచుతారా మరి" అన్నాడు ఆడ ఖైదీలతో. తప్పదన్నట్టు ఒప్పుకున్నారు ఆడవాళ్ళు.

"మరయితే లోపలకి పోదాం పదండి" అన్నాడు వాడు తాళాలు జేబులోనుండి తీస్తూ.

"అబ్బే!" కంగారు పడ్డారు ఆడాళ్ళు "ఇదసలే ఆయుధాగారం. తుపాకులు, బాంబులు. అమ్మో! మాకు భయం" అన్నారు వాళ్ళు.

"మరయితే ఎలా?" తలలు గోక్కున్నారు మగాళ్ళు.

వేలితో రాళ్ళకేసి చూపించారు ఆడాళ్ళిద్దరూ. కాపలావాళ్ళు నవ్వుతూ "అదీ మంచిదే. చల్లగాలి కూడానూ" అన్నారు కదులుతూ.

ఆడాళ్ళు ఆశ్చర్యపోతూ "మగ్గురూనా?" అన్నారు. కాపలావాళ్ళు నవ్వుతూ. "మాకళాంటివేం లేవు పదండి" అన్నారు.

రాళ్ళ వెనక్కి చేరుతూనే కాపలావాళ్ళ బుర్రలు బద్దలయ్యాయి. వాళ్ళ శవాలనక్కడే వదలి గిడ్డంగి చేరారంతా.

తలుపులు తెరిచి లోపల దూరారు. లోపల వరుసలుగా పేర్చబడివున్న అనేక రకాలయిన ఆధునిక ఆయుధాలను చూసి ముక్కున వేలేసుకున్నారందరూ.

"ఈ ఆయుధాలతో ఒక డివిజన్ సైన్యాన్ని నిర్వహించవచ్చు" అన్నారు సైనికాధికారు లిద్దరూ.

మనిషొక మిషన్‌గన్ చేతబట్టారు. హేండ్ గ్రెనేడ్లు, మినీ సైజు బాంబులు వీలయినన్ని పట్టుకున్నారు. ఒకరి వెంట ఒకరు వరసగా బయల్దేరారు.

హెర్క్యులిస్ జెట్టీకి తాళ్ళతో కట్టబడి వుంది. తెల్లవారేందుకు ఇక యెంతో సమయం లేదు. నౌక అప్పర్ డెక్ మీద ఒకరిద్దరు కాపలా వున్నారు. ఇక తెల్లవారబోతుందనే ధీమాలో చాలామంది కాపలాదార్లు లోపలికి పోయారు. షిప్ మీదకు పోయే గాంగ్ వే ఎత్తివేయబడి వుంది.

నౌకను జెట్టీకికట్టిన తాళ్ళ ఆధారంగా పైకి చేరారందరూ. బల్వంత్ విజిల్ వేసాడు గట్టిగా. అందరూ ఒక్కేసారి ముందుకు కదిలారు. ఎదురుపడిన సముద్రపు

దొంగలు అక్కడికక్కడే కూలుతున్నారు. కేకలు, అరుపులు, ఆర్తనాదాలు. మరో ప్రక్క మిషిన్‌గన్‌లు నిర్విరామంగా గర్జిస్తున్నాయి. సముద్రపు దొంగలు జరుగుతున్నదేమిటో తెలుసుకునే లోగానే అంతా నేల కూలారు.

కొందరు ఖైదీలు హెర్క్యులిస్ బంధాలను తెగనరికారు. హెర్క్యులిస్ సముద్రంలోనికి దారితీసింది. రూసోకి విషయం తెలిసి తన అనుచరులను కూడగట్టుకొని జెట్టీని చేరేసరికి హెర్క్యులిస్ సముద్రంనుండి ఎడతెరిపిలేకుండా దీవివైపున్న వాళ్ళ స్థావరాలమీద అగ్నివర్షం కురిపిస్తోంది. రూసో అనుచరుల హాహాకారాలు మిన్నుముట్టాయి. నెత్తిమీద చేతులతో వాళ్ళంతా తలో దిక్కుకు పారిపోసాగారు.

ఈలోగా రాజు మాజీ సైనికాధికారుల సహాయంతో అమెరికన్ నేవీ అధికార్లకు విషయాన్ని వివరించి చెప్పాడు.

కొన్ని గంటల సమయంలో అమెరికన్ యుద్ధ విమానాలు వందలకొద్దీ సైనికులను పారాచ్యూట్‌ల ద్వారా ఆ దీవిమీదకు దించింది. అమెరికన్ సైనికులు చెట్టు పుట్టలు సయితం వదలకుండా గాలించి సముద్రపు దొంగల ముఠాలో చావగా మిగిలినవాళ్ళను బందీలుగా పట్టుకుంది—

—:అయిపోయింది:—